ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 20 సెప్టెంబరు 2025


సానేవారిపల్లె వద్ద తెగిపోయిన రోడ్డు

కొట్టుకుపోయిన రోడ్లు

సుండుపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో ఉన్న అయ్యవారి చెరువు శుక్రవారం తెల్లవారుజామున తెగింది. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చెరువులోకి వరద నీరు, వర్షపు నీరు రావడంతో చెరువుకు గండిపడి తెగినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే చెరుకువాండ్లపల్లె సమీపంలో పింఛా నుంచి సుండుపల్లెకు పోయే ప్రధాన రహదారి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. అలాగే రాయవరం దిగువ భాగంలోని రెడ్డివారిపల్లెకు పోయే మట్టి రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఇక ఉన్న పింఛా రోడ్డు కూడా తెగిపోవడంతో సుమారు 40 పల్లెలకు రాకపోకలకు నిలిచిపోయాయి. కాగా చెరుకువాండ్లపల్లె సమీపంలో తెగిపోయిన రోడ్డును టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు.


నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మట్టి రోడ్డు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు మండంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు బారీగా మొరవలు పోతున్నాయి. పెద్దతిప్పసముద్రం మండలంలో 30 ఏళ్లలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో 163.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన వర్షం వేకువజాము వరకు వర్షం ఏకధాటిగా కురిసింది. పీటీఎం ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని కమ్మచెరువులోని తలారి బాబుకు చెందిన ఇల్లు కూలిపోయింది. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఉన్నట్టుండి కూలిపోవడంతో మహిళలకు స్వల్పగాయాలయ్యాయి.

హంద్రీ-నీవా కాలువకు గండి

బి.కొత్తకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు ఇరువైపులా కట్టుదిట్టంగా వేశామంటున్న లైనింగ్ వర్షపు నీటి తాకిడికే ధ్వంసమైన సంఘటన బి.కొత్తకోట పట్టణ శివారు బడికాయలపల్లి మార్గంలో జరిగింది. గురువారం రాత్రి పట్టణంలో భారీ వర్షం కురవడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వర్షపునీరు హంద్రీనీవా కాలువలోకి ప్రవహించింది. సిమెంట్ లైనింగ్ దెబ్బతినడంతో అక్కడికి చేరుకున్న పలువురు రైతులు భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా అధికారి ప్రతాప్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కుషావతి నది

పెద్దమండ్యం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలో కుషావతి నది ఉధృతంగా సాగుతోంది. వాహనాలు, ప్రయాణికుల రాకపోకల స్తంభించిపోయాయి. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు కుషావతి నదికి చేరుతోంది. దీంతో శుక్రవారం ఉదయం పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారిలో కుషావతి నది ప్రవాహంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. తెల్లవారుజామున కుషావతి నది దాటుతున్న ఓ ఆటో నదిలో బోల్తా పడడంతో ప్రయాణికులను స్థానికులు రక్షించారు. తహసీల్దార్ తేజశ్వి, ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిస్థితిని పర్యవేక్షించారు. కాగా నది వద్ద స్థానికులు గంగమ్మకు పూజలు నిర్వహించారు.


కుషావతినది ఉధృతికి స్తంభించిన రాకపోకలు

ములకలచెరువులో కుండపోత

- జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీరు
- వరద ధాటికి వాగులో పడ్డ కారు
- ఉగ్రరూపం దాల్చిన పెద్దేరు...
- స్తంభించిన రాకపోకలు
- నేలకూలిన ఇళ్లు

జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం దంచికొట్టింది. చుక్కనీరు లేని చెరువులు, కుంటలు రాత్రికే రాత్రే నిండి మొరవపోతున్నాయి. ఇక ములకలచెరువులో అయితే కుండపోతే. రికార్డు స్థాయిలో 256 మి.మీ వర్షం కురిసింది. సమీపంలోని అన్నమయ్య- శ్రీసత్యసాయి జిల్లా సరిహద్దులోని ఎద్దులవారిపల్లె చెరువుకు హంద్రీ-నీవా నీరు మళ్లించడంతో పాటు కుండపోత వర్షం కురవడంతో చెరువు నిండిపోయి ఓవర్ ఫ్లో అయింది. దీంతో వరద నీరంతా ముంబై- చెన్నై జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించింది. వరద నీరు దాటే క్రమంలో అనంతపురం నుంచి తిరుపతికి వెళ్తున్న ఓ కారు వాగులో పడింది. పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, సుండుపల్లె మండలాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి.


సోంపల్లెలో పడిపోయిన ఇంటి గోడ

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో శుక్రవారం తెల్లవారుజామున క్లౌడ్ బరస్ట్‌లా... కుండపోత వర్షం కురిసింది. తెల్లవారుజామున 12.30 నుంచి ఉదయం 5.30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. నీటి ఉధృతికి జాతీయ రహదారిలో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు దాటే క్రమంలో అనంతపురం నుంచి తిరుపతికి వెళ్తున్న ఓ కారు వాగులో పడిపోయింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను బయటకు తీశారు. నీటి ఉధృతి తగ్గిన తరువాత బోల్తా పడ్డ కారును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. ఉదయం 11 గంటల వరకు నీటి భారీ ప్రవాహం కొనసాగింది. జాతీయ రహదారికి ఇరువైపులా పది కి.మీ. మేరకు వాహనాలు బారులు తీరాయి. మండలంలోని చౌడసముద్రం సమీపంలో పెద్దేరు ఉగ్రరూపం దాల్చడంతో వర్షపు నీరు భారీగా ప్రవహించాయి. దీంతో ములకలచెరువు- తంబళ్లపల్లె రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కుండపోత వర్షం ధాటికి మండలంలోని సోంపల్లె పంచాయతీ అడవిచెరువు వద్దనున్న చెరువులు నిండి తెగిపోయాయి. చౌడసముద్రం పంచాయతీ చౌటకుంటపల్లె సమీపంలోని చెరువులు, కుంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాలుగు చెరువులు తెగిపోయి నీరు వృథాగా పోగా, మరో నాలుగు చెరువులు, కుంటలు గండ్లు పడి లీకేజీ అవుతున్నాయి. సోంపల్లె పంచాయతీ గట్టుకిందపల్లె సమీప గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు తెగిపోయిన నీరంతా టమోటా, వరి పంటల్లోకి చేరి మునిగిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. తెగిపోయి గండ్లు పడ్డ చెరువులు, రోడ్డును ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ సతీష్‌కుమార్‌లు పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు.


ములకలచెరువుకు సమీపంలోని జిల్లా సరిహద్దులో జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు, నిలిచిపోయిన వాహనాలు

నీట మునిగిన పంటలు.. నేలమట్టమైన ఇళ్లు

మండలంలో కురిసిన కుండపోత వర్షానికి పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ములకలచెరువు, సోంపల్లె, దేవళచెరువు, మద్దినాయనిపల్లె, వేపూరికోట, నాయనిచెరువుపల్లె, కదిరినాథునికోట తదితర గ్రామాల్లో టమోటా, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం చేకూరింది. సానేవారిపల్లె వద్ద రైతులు పూజారి వెంకటరమణ, సుధాకర్‌రెడ్డిలకు చెందిన ఐదు ఎకరాలు పూర్తి స్థాయిలో నీటిలో మునిగిపోయాయి. సోంపల్లెలో రంగాళ్ల దాస్, బయన్న, రవికుమార్, దాసిరెడ్డిగారిపల్లెలో రామప్ప ఇంటి గోడలు పడిపోయాయి. ములకలచెరువులో ఓ ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. కుండపోత వర్షం వల్ల ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు.


నీట మునిగిన మామిడి తోట

రికార్డు స్థాయిలో 256 మి.మీ వర్షం

ములకలచెరువు మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఏకంగా 256 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోనే అతిపెద్ద చెరువైన సోంపల్లె చెరువు కేవలం 10 గంటల్లోనే నిండి మొరవపోతోంది. దేవళంచెరువు పంచాయతీలోని దేవళచెరువు, శేషమ్మచెరువు, చిన్నపాపమ్మచెరువు, కన్నెమడుగుచెరువు, గండరాజుచెరువులు, మద్దినాయనిపల్లె పంచాయతీలోని వాయల్‌చెరువు, తిటివానికుంట, నక్కికుంట, తెల్లోల్లికుంటలు మొరవపోతున్నాయి. సోంపల్లె పెద్దచెరువు వద్ద టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, నాయకులు పూజలు చేశారు. ములకలచెరువు మండలంలో ఈ నెల మొత్తం 111.9 మి.మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఒకే రోజు రాత్రి 256 మి.మీటర్ల కురిసింది.


కమ్మచెరువులో నేలకూలిన ఇల్లు

పెద్దేరుకు భారీగా వరద నీరు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 49.2 మీ.మీల వర్షపాతం నమోదైందని మదనపల్లె డిప్యూటీ డీఎస్‌వో కొండయ్య తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టులు మొరవ పోగా..పలు చెరువులు నిండుకుండను తలపించాయి. గురువారం రాత్రి కూడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో ఒకట్రెండు రోజుల్లో పెద్దేరు కూడా మొరవ వెళ్లే అవకాశం ఉందని ఇరిగేషన్ ఏఈ సతీష్‌రెడ్డి తెలిపారు.

రైతులను ఆదుకుంటాం

నియోజకవర్గంలో కురిసిన కుండపోత వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. అధికారులను గ్రామాలకు పంపి పంట నష్టంపై నివేదికలు అందించాలని తెలియజేశాం. పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చేసి అండగా ఉంటాం. తెగిపోయిన చెరువులు, కుంటలకు తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. చౌడసముద్రం సమీపంలోని పెద్దేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నందున వంతెన నిర్మాణం త్వరలో చేపడతాం.

- జయచంద్రారెడ్డి, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి

పంటనమోదు వేగవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించే పంటలకు పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి పెద్దతిప్పసముద్రం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి కార్యాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. వారితో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూములకు గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఉన్న భూములు లేనట్టు లేని భూములు ఉన్నట్టు తారుమారు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం అటువంటి సమస్యలు లేకుండా పరిష్కారించాలని ఆదేశించారు. అనంతరం పీటీఎం సమీపంలోని కుమ్మరవారిపల్లె సమీపంలో వ్యవసాయాధికారులు చేపడుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించి పంట నమోదు ప్రక్రియలో మండలం అత్యంత వెనుకంజలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములునాయక్, మండల వ్యవసాయాధికారి ప్రేమలత, మండల సర్వేయర్ శ్రీవాణిలతో పాటు వీఆర్వోలు పాల్గొన్నారు.

రాయచోటిలో వర్షబీభత్సం

- రోడ్లపైన ఐదడుగుల మేర నీరు
- మురుగునీటి కాలువలో నలుగురు గల్లంతు
- ముగ్గురి మృతదేహాలు లభ్యం

రాయచోటి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా మురుగునీటిలో కొట్టుకుపోయి నలుగురు మృతిచెందారు. ఈ దుర్ఘటనలో 6 ఏళ్ల బాలిక మృతదేహం ఆచూకి తెలియలేదు.

శుక్రవారం సాయంత్రం 6.50 గంటల ప్రాంతంలో రాయచోటిలో ఒక్కసారిగా కుండపోత వర్షం మొదలై ఏకధాటిగా కురిసింది. వర్షం నీరు, మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహించాయి. ఆ సమయంలో స్థానిక కొత్తపేట రామాపురం నాలుగు కుళాయిల వద్ద ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో వెళుతున్న ఆటోలోకి నీళ్ల రావడంతో భయాందోళనకు గురైన పిల్లలు ఒక్కసారిగా కిందకు దిగేశారు. దీంతో యామిని (6) అనే బాలిక పక్కనే ఉన్న మురుగునీటి కాలువలో పడి కొట్టుకుపోయింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, తహ శీల్దార్ నరసింహకుమార్‌తో పాటు మున్సిపాలిటీ, ఫైర్, వివిధ శాఖల అధికారులు అక్కడకు చేరు కున్నారు. రాత్రి 11.15 గంటలకు కూడా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎస్ఎన్ కాలనీ గుండ్ల కుంట రోడ్డు ప్రాంతంలో మున్ని (27), ఆమె కుమారుడు ఇలియాస్(6) ఇంటి ముందు మురుగు నీటి కాలువమీద బండలపై నిలబడికుని ఉండగా.. ఒక్కసారిగా అవి కూలిపోవడంతో వీరి ద్దరూ నీళ్లలో కొట్టుకుపోయారు. వీరిని రక్షించేం దుకు ప్రయత్నించిన ఎదురింటికి చెందిన గణేష్ (30) అనే వ్యక్తి కూడా మృతిచెందాడు. వీరి మృత దేహాలు లభ్యమయ్యాయి. సంఘటన స్థలా న్ని అర్ధరాత్రి కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మేనళ్లుడు మౌర్యరెడ్డిలు పరిశీలించారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు.






యామిని ఫైల్ ఫొటో


శుక్రవారం అర్ధరాత్రి బాలిక తండ్రితో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శుక్రవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్పీని అభినందించారు. అనంతరం శాంతిభద్రతలు, వివిధ అంశాలపై చర్చించారు.

విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక ఇన్‌స్పైర్ మనాక్ : డీఈవో

రాయచోటిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్ర జ్యో తి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదిక ఇన్‌స్పైర్ మనాక్ అని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ హెల్ప్ డెస్క్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడి యాతో మాట్లాడుతూ దసరా సెలవులు వస్తున్నందున జిల్లాలోని అన్ని పాఠశాలలు శనివారం సాయంత్రంలోపు విద్యార్థులతో ఆన్‌లైన్ లో నామినేషన్లను సమర్పించాలని సూచించారు. అలా చేయని వారు సెలవుల్లో నేరుగా డీఈవో కార్యాలయానికి వచ్చి నామినేషన్లు సమర్పించాల్సి వస్తుందని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకే తిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, సైన్స్ రీసోర్స్ పర్సన్ రంజిత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాజంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అన్నిశాఖల అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లోని సభాభవనంలో సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావనతో కలిసి రాజంపేట నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అధికారి తమకు సమస్య ఎదురైనప్పుడు పాజిటివ్ దృక్పథంతో ఆ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడ సమస్య ఉందో గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రధానంగా రాజంపేట మున్సిపాలిటీకి సంబంధించి డ్రైనేజి వ్యవస్థ, చెత్త సేకరణ, ప్రజారోగ్యం, నీటి సరఫరా తదితర సమస్యలపై కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ సిబ్బంది సమష్టిగా పనిచేసి సమస్యను పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో పండిస్తున్న వివిధ రకాల పంటలు, వాటి విస్తీర్ణత, సంబంధిత వ్యవసాయాధికారులు తెలుసుకుని వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో అరటి, మామిడి పంటలు ఎక్కువగా పండిస్తున్నారని రైతులకు ఈ పంటలపై అవగాహన, గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ రహదారుల సమస్యపై ఆరా తీశారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐడీసీఎస్ శాఖ సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. పేదలకు అందజేసే పక్కా గృహాలు నిర్మాణం, లేఅవుట్‌లలో నిర్మాణాలు పూర్తి కాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, సబ్‌కలెక్టర్ భావన

ఆరెకరాల భూసేకరణ కోసం.. ఆగిపోయిన హంద్రీనీవా

- శాసనసభలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రూ.కోట్లు వెచ్చించి పూర్తి చేసే దశలో కేవలం ఆరెకరాల భూసేకరణ కోసం మొత్తం హంద్రీనీవా పథకం (ఫేజ్-3) ఆగిపోయిందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆరెకరాల భూసేకరణ పూర్తి చేసి 500 మీటర్ల కాలువను తవ్వితే పీలేరు నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఆయన వివరించారు. శుక్రవారం శాసనసభ జీరో అవర్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన హంద్రీనీవా కాలువ పూర్తి కాకపోవడానికి ఉన్న అడ్డంకుల గురించి మాట్లాడారు. ఇప్పటికే హంద్రీనీవా ఫేజ్-3 కోసం రూ.3,443 కోట్లు ఖర్చు చేశారని, శ్రీనివాసపురం, అడవిపల్లె రిజర్వాయర్లు సిద్ధంగా వున్నాయని చెప్పారు. 2014-19 మధ్య అప్పుడు కూడా సీఎంగా వున్న చంద్రబాబునాయుడు అడవిపల్లె రిజర్వాయరును సందర్శించి హంద్రీనీవా పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఇసుమంత పనులు కూడా జరగలేదన్నారు. చిన్నమండెం వద్ద ఆరు ఎకరాలు భూసేకరణ పూర్తి చేసి 500 మీటర్ల కాలువను అందుబాటులోకి తెస్తే హంద్రీనీవా నీళ్లు పీలేరు భూములకు చేరుకుంటాయని వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హంద్రీనీవా ద్వారా మొత్తం 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందే విధంగా పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. అందులో కేవలం పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనే 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. జలవనరుల మంత్రితో పాటు ప్రభుత్వం శ్రద్ధ పెడితే 20 ఏళ్లుగా పెండింగ్‌లో వున్న పథకం పూర్తవుతుందని చెప్పారు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే కేవలం ఆరు నెలల్లో పీలేరుకు సాగునీరు అందుబాటులోకి వస్తాయని కిశోర్‌కుమార్‌రెడ్డి విశదీకరించారు.


హంద్రీనీవా గురించి అసెంబ్లీలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

పట్టుదొరికేనా..?

రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం.. పట్టు రైతుల పాలిట శాపంగా మారింది. ఒకప్పుడు పడమటి ప్రాంత మండలాల్లో భారీగా పట్టు సాగు చేసే వారు. కరోనా సమయంలో పట్టు ధరలు విపరీతంగా తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టు రైతులను పట్టించుకోలేదు. దీంతో రైతన్నలు అప్పులపాలై అయోమయ స్థితిలో పడ్డారు. ఆ దెబ్బ నుంచి రైతులు ఇప్పటికీ కోలుకోలేకున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం పట్టు రైతులను ప్రోత్సహించడానికి కనీస సౌకర్యాలు, రాయితీలు కల్పించలేదు. దీంతో చాలామంది రైతులు పట్టు సాగును మానుకుని ఇతర పంటలవైపు మళ్లారు.

- గత ప్రభుత్వ పాపం.. పట్టురైతుల పాలిట శాపం
- నేడు ధరలు పెరిగినా.. ఆసక్తి చూపని రైతన్నలు

కురబలకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో ప్రధాన జీవనవనరు వ్యవసాయమే. ఇక్కడి రైతులు టమోటా, వేరుశెనగ, ఉల్లి పంటలతో పాటు పట్టు పంట సాగు చేస్తారు. మిగతా పంటల మాదిరిగా కాకుండా పట్టు పంటకు నికర ఆదాయం దక్కుతుంది. దీంతో అన్ని సమయాల్లో లాభాలను ఆర్జించవచ్చు. అయితే కరోనా సమయంలో విపరీతంగా నష్టాలను చవిచూడడంతో చాలా మంది రైతులు పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపలేదు. అనంతరం పలుమార్లు పంటలకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రధానంగా వేసవిలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు లాభాలు ఆర్జించవచ్చునని ఆశించినా.. అలా జరగలేదు. ధరల్లేక నష్టపోయారు.

మార్కెట్ సౌకర్యం లేదు

వర్షాకాలం మినహా మిగిలిన అన్ని సమయాల్లో పంటను ఎక్కువగా సాగుచేస్తారు. షాకీ కేంద్రం నుంచి మట్టి పురుగులు తెచ్చి పంటను సాగు చేస్తారు. ఈ పంట చేతికి అందడానికి శీతాకాలంలో నెల రోజులు, వేసవిలో దాదాపుగా 25రోజులు పడుతుంది. కాగా కొన్ని సమయాల్లో పంట పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. అయినా కష్టపడి సాగుచేస్తున్నారు. అయితే ఇక్కడ మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది కర్ణాటకలోని చింతామణి, కోలార్, సిల్లగట్టు తదితర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు. దీంతో వీరికి ఖర్చు ఎక్కువగా వస్తోంది. మార్కెట్‌లో మొదటి రకం పట్టు గూళ్లు కిలో అప్పట్లో రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది.

వైసీపీ హయాంలో అందని రాయితీ

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అమలు కాలేదు. గతంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి షెడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు వ ం జూ ర ు చేసేవారు. ఇందులో కేంద్రప్రభుత్వం 50శాతం రాయితీ, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ, మిగిలిన 25శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. షెడ్డు నిర్మాణం పూర్తయిన వారం రోజుల్లో రాయితీ సొమ్ము జమ అయ్యేది. అయితే షెడ్డు నిర్మాణాలు చేపట్టిన కొంతమంది రైతులకు రెండు, మూడు ఏళ్ల అనంతరం రాయితీ చెల్లించారు. చాలా మంది రైతులకు ఇప్పటికీ రాయితీ నిధులు జమకాలేదు. 2019కి మునుపు బైవోల్టిన్ రకం పట్టు సాగుకు కిలోకు రూ.50 ప్రోత్సాహకాన్ని అందించేవారు. ఆ రాయితీని వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ఆపేశారు. గతంలో ప్రతి మండలానికి రైతుల సమస్యలు తీర్చడానికి ఇన్‌స్పెక్టర్, టీఏలు ఉండేవారు. చాలామంది పదవీ విరమణ పొందడంతో 15మండలాలకు ఒక అధికారితో కాలం వెల్లదీశారు. ఇవి కూడా పట్టు సాగు తగ్గడానికి కారణాలు.

ధరలు పెరిగినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టు ధరలు భారీగా పెరిగాయి. అయినా రైతులు పట్టును సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌లో మొదటి రకం రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం రూ.700 నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.600 నుంచి రూ.650 ఉంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే ముందులాగా పట్టుసాగు పెరిగే అవకాశం ఉంది. అలాగే పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. లేదంటే జిల్లాలో పట్టుసాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.


రైతులు సాగు చేసిన మల్బరీ పంట


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పట్టుగూళ్లు

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

27 ఏళ్లుగా పట్టును సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. మా ప్రాంతంలో దిగుబడి చేసిన పంటను కర్ణాటకాలోని సిల్లగట్టుకు తరలించి విక్రయిస్తాము. మాకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవంతో 130 కిలోమీటర్ల దూరం తరలించాల్సి వస్తోంది. దీంతో పంటను తరలించడానికి ఖర్చు ఎక్కువగా రావడంతో పాటు సమయం వృధా అవుతుంది. మాకు ఇక్కడే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. లోకల్ మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పట్టుకు సకాలంలో నగదు చెల్లించాలి.



- గుణశేఖర్ రెడ్డి, రైతు, మట్లివారిపల్లె, కురబలకోట మండలం

ఆలయంలో చోరీ- నగదు అపహరణ

వాల్మీకిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి వాల్మీకిపురం పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. ఎండోమెంట్ ఈఓ అధికారుల ఫిర్యాదు మేరకు వివరాలిలా... పట్టణ సమీపంలోని నిమ్మనపల్లె మార్గంలో వెలసిన పురాతన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశిస్తూ తొలుత సీసీ కెమెరాల పరికరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆలయంలోకి చొరబడి వెండి కిరీటం, హుండీ నగదు, సీసీ పుటేజీ పరికరాలను అపహరించుకుపోయారు. కొత్తగా ప్రారంభమైన నాలుగు వరుసల రహదారి పక్కగా ఉన్న దేవాలయంలో ఈ చోరీ సంఘటన చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం విషయాన్ని గ్రహించిన ఈఓ మంజుల ఆలయానికి చేరుకుని పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన అనంతరం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపి ఆలయ పరిసరాల్లో పరిశీలన చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


కుక్కదాడిలో గాయపడిన చిన్నారి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేసి చిన్నారిని గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, వలసపల్లె గ్రామం డ్రైవర్స్ కాలనీకి చెందిన మహేష్, గంగోత్రి దంపతుల కుమారుడు తరుణ్ శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే గాయపడిన కుమారుడుని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల ప్రభావం అధికంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒకరి అరెస్టు


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కె.వి.బావి బీట్ వద్ద శుక్రవారం 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్ తెలిపారు. కె.వి.బావి బీట్‌లో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వారిపై దాడి చేసి తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేశ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు మోహన్‌కుమార్, జనార్దన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న డీఈ, తహసీల్దార్

రామసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ అజారుద్దీన్, విద్యుత్ డీఈ హరికుమార్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని, నడింపల్లె రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉండగా వాటికింద వ్యవసాయ సర్వీసులు 13 వేలు ఉన్నాయన్నారు. వీటికి సరిపడా విద్యుత్ సరఫరా తక్కువగా ఉండడం వల్ల నూతన సబ్‌స్టేషన్ నిర్మించి వ్యవసాయానికి నిరంతరంగా 9గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్, ఆర్ఐ వసీం, వీఆర్‌వో రెహమాన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలానికి చెందిన గ్రామ సర్వేయరు గుడి అశోక్‌కుమార్‌పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ చిన్నమండెం-1 గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తూ అదే మండలంలోని మల్లూరు గ్రామంలోని సర్వే నెం.1186, 1187లోని 6.39 ఎకరాలను విడగొట్టి మల్లూరు గ్రామం కొత్తపల్లె ఎస్సీ కుటుంబానికి చెందిన రైతుల పేరుతో నాలుగు భాగాలుగా సర్వే చేసి చిత్రపటాలు తయారు చేయడానికి రూ.60 వేలు డిమాండు చేశాడనే అభియోగాలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదు చేసింది. డిమాండు మేరకు రూ.60 వేలు ఇస్తేగానీ సర్వే చేయనని అశోక్‌కుమార్ భీష్మించుకోవడంతో 2023 జనవరి 6న ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరుకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కుటుంబంలోని నలుగురి పేరుతో ఆ భూమిని పట్టాలు ఇవ్వడానికి జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా లభించి జిల్లా కలెక్టరు పట్టాలు కూడా జారీ చేశారు. దీన్ని సబ్ డివిజన్ చేయాల్సిన దశలో అశోక్‌కుమార్ మెలిక పెట్టారు. చివరకు పని పూర్తయిందని రూ.60 వేలు తీసుకురావాలని సర్వేయర్ రైతులను పిలిపించుకున్నాడు. అయితే అంత మొత్తం ఇవ్వలేక మూడు రోజుల తరువాత వస్తామని రైతులు తిరిగి వెళ్లిపోయారు. సర్వేయర్ ఫోన్ కాల్స్‌కు సంబంధించిన రెండు మెమొరీ కార్డులను జతచేస్తూ రైతులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు 2023 ఏప్రిల్ 4న కేసు నమోదు చేసి కడప ఏసీబీ ఇన్‌స్పెక్టరు ఇ.కృష్ణమోహన్ దర్యాప్తు చేపట్టారు. అప్పటి కొత్తపల్లె వీఆర్వో పి.నాగేశ్వరి, చిన్నమండెం తహసీల్దారు ఎం.శ్రీరాములు నాయక్, మరో తహసీల్దారు సి.నరసింహులు, డిప్యుటేషన్‌పై పనిచేసిన పీలేరు స్పెషల్ సర్వేయర్ కె.లోకేశ్వరిలను విచారించి మొత్తం వ్యవహారంపై వాంగ్మూలాలు నమోదు చేశారు. నలుగురు రైతుల సాక్ష్యాలను నమోదు చేసింది. దీనికి ప్రధాన ఆధారంగా లంచం డిమాండు చేస్తూ అశోక్‌కుమార్ ఫోను చేసిన 3 నిముషాల 24 సెకండ్ల నిడివిగల ఆడియో రికార్డింగ్‌ను ఏసీబీ జతచేసింది. సర్వేయర్ అశోక్‌కుమార్ లంచం డిమాండు చేయడానికున్న అన్ని అవకాశాలను ఏసీబీ పకడ్బందీగా విశదీకరించింది. మొత్తం మీద 2025 ఏప్రిల్ 30న ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీనిపై ప్రభుత్వం విచారణ చేయించి చర్యలు తీసుకునేందుకు నిర్ణయించిన దరిమిలా సర్వేయర్ అశోక్‌కుమార్‌కు 20 పేజీల చార్జి నోటీసును జారీ చేసింది. 10 రోజుల్లోగా వివరణ సమర్పించుకోవడం కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు ప్రోత్సాహం

- పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు నాగార్జున, శంకరప్ప

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పరిశ్రమల స్థాపనకు ,అభివృద్ధికి, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి ఉపయోగపడుతుందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు కె.నాగార్జున, శంకరప్ప తెలిపారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, వ్యాపారం సులభతరం చేయడానికి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి, సర్టిఫికెట్ అందజేశారు ఈ సందర్భంగా గ్లోబల్ సర్వీసెస్ ట్రస్టు చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ మంచి ప్రణాళికతో ముద్ర రుణాలు, పీఎంఈజీపీ లోన్లు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఏటీఎం మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఆహార ఉత్పత్తిరంగంలో సబ్సిడీ లభిస్తుందని, ముద్ర పీఎంఈజీపీ ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు మాట్లాడుతూ ఈ వర్క్‌షాపునకు హాజరైనవారిలో 60 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 50 మంది మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు పి.దామోదర్, ఎం.హరిబాబు, సీసీ సుబ్బమ్మ, పి.గోవిందమ్మ, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

- పశుసంవర్థక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం కోటకొండలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా 15 నుంచి అక్టోబరు 15 వరకు పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తారన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి నురగ రావడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ శిబిరంలో 186 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 210 పశువులకు బ్లూటాక్స్ పిచికారీ చేశామన్నారు. 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 56 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సుమిత్ర, మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, కూటమి నాయకులు రెడ్డప్ప, రాజేష్, సిబ్బంది హేమాపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. సోంపల్లె పెద్దచెరువు నిండి కోనేటివారిపల్లె మీదుగా మొరవపోతుండంతో శుక్రవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు మొరవపోతున్న, వాగులు ఉన్న సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది కలిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రాత్రంతా కోనేటివారిపల్లెలో పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచుతున్నామన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవన్నారు. కాగా మొరవ నీరు కోనేటివారిపల్లెలోని ఓ ఇంట్లోకి వస్తుడడంతో ఖాళీ చేయించి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లోకి పంపారు. ఆయన వెంట సీఐ వెంకటేశులు, ఎస్ఐ నరసింహుడు తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- వైసీపీ శ్రేణుల ధర్నా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని అలా కాకుండా ప్రైవేటుకు దారాదత్తం చేస్తే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకూడూరు నుంచి వేలాదిగా వైసీపీ శ్రేణులు తరలిరావాలని ఇచ్చిన పిలుపునకు కేవలం 500 మాత్రమే ధర్నాకు రావడం విశేషం. రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, తిరుపతి నుంచి భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారి అనుచరులు శుక్రవారం మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద నిర్మాణాలు నిలిచిపోయిన మెడికల్ కాలేజి భవనాల వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, పలు నియోజకవర్గాల నుంచి వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం పట్టివేత


పట్టుబడిన వాహనంతో పాటు స్మగ్లర్‌ను అరెస్ట్ చూపుతున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ తెలిపారు. అత్యంత రహస్య సమాచారం మేరకు యల్లమంద - పీలేరు మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఏపీ29 ఏజీ0959 నెంబరు ఇన్నోవా అతివేగంగా వచ్చిందన్నారు. వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న ఐదు ఎర్రచందనం దుంగలు, తమిళనాడుకు చెందిన ఓ స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన స్మగ్లర్, వాహనం సహా ఎర్రచందనం పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. ఎర్రచందనం, వాహనం విలువ రూ. 8.50 లక్షలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ దాడితో ఎఫ్‌ఆర్‌ఓ ఎస్.చంద్రశేఖర్, సెక్షన్ అధికారి ప్రకాష్‌కుమార్, బీట్ ఆఫీసర్లు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్, పారెప్ప, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాగేనీరు అనుకుని విషద్రావణం సేవించి చిన్నారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సిరికల్చర్ కాలనీలో చోటు చేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే... మదనపల్లె పట్టణం, సైదాపేటలో కాపురం ఉంటూ సిరికల్చర్ కాలనీలో పట్టు గూళ్ల రీలింగ్ సెంటర్‌లో కూలిగా షాదియా పనిచేస్తోంది. ఈమె భర్త కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులో కూలీ పనులు చేసుకుంటుండడంతో రోజూ రెండేళ్ల కుమార్తె అలియాతో కలిసి పనికి వెళ్లేది. ఈ క్రమంలో తల్లిపని చేసుకుంటున్న సమయంలో అక్కడే ఆడుకుంటున్న చిన్నారి నీళ్లు అనుకుని రీలింగ్ సెంటర్‌లో ఉంచిన విషద్రావణం సేవించి స్పృహ కోల్పోయింది. గమనించిన రీలింగ్ సెంటర్ యాజమాని, తల్లి స్వర్ణకుమారి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో చిన్నారి అలియా మృతి చెందింది. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్...


మృతిచెందిన వాచ్‌మన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, బసినికొండ జడ్పీ హైస్కూల్ వాచ్‌మన్ శ్రీనివాసులు (60) మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. శ్రీనివాసులు తన మనుమరాలు తరుణికను బైక్‌లో కూర్చోబెట్టుకుని స్కూల్ నుంచి ఇంటికి శుక్రవారం సాయంత్రం బయలుదేరాడు. పుంగనూరు బైపాస్ రోడ్డు, సాయిబాబా ఆలయం వద్ద పుంగనూరు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీనివాసులు, మనుమరాలు గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు శ్రీనివాసులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అమరావతి, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉందన్నారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్యకేసుగా పోలీసుల దర్యాప్తు


రీ పోస్టుమార్టం కోసం తవ్వుతున్న అధికారులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో అదృశ్యమైన వ్యక్తి కేసును హత్య కేసుగా మదనపల్లె టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేసి శుక్రవారం రీ పోస్టు మార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీకి చెందిన జరిపిటి రామన్న (40) ఈ ఏడాది మార్చి 12న అదృశ్యయ్యాడు. తన సోదరుడు హనుమంతు ఫిర్యాదుతో ఈ ఏడాది జూన్ 21న మదనపల్లె రెండో పట్టణ పోలీసులు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి భార్య రమణమ్మ, ఆమె సోదరుడు ఈశ్వర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తమ్ముడు హనుమంతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి వారు ఇరువురు పరారీలో ఉండడంతో అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడంతో రామన్న హత్య వెలుగులోకి వచ్చింది. వారి వివరాల మేరకు బి.కొత్తకోట మండలం, కస్తూర్బా పాఠశాల సమీపంలోని హంద్రీనీవా కాల్వ వద్ద పూడ్చిన రామన్న మృతదేహాన్ని వెలికితీసి అక్కడికక్కడే శవ పరీక్షలు నిర్వహించారు. సీఐ రాజారెడ్డి ఈ కేసును హత్య కేసుగా నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంప్ వెండర్స్ నిరసన

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ కోసం కొత్తగా తీసుకొచ్చిన ఓటీపీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా లేఖరుల పెన్ డౌన్‌లో భాగంగా పీలేరులో నిరసన తెలిపారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశ పెట్టిన కొన్ని విధానాలతో తీవ్ర జాప్యం నెలకొంటోందని ఆరోపించారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీ అనేది జఠిలంగా మారుతోందన్నారు. అటు ప్రజలు ఇటు దస్తావేజుల లేఖరులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వానికి తెలియజేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చలపతి, స్టాంపుల మస్తాన్, మురళి, నరసింహారెడ్డి, ఖాదర్‌వల్లీ, రజాక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలి

● వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగం 75 - సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం పొలిటికల్ సైన్స్ లేదా హ్యూమానిటీస్ విద్యార్థులకే పరిమితం కాదని, ప్రతి విద్యార్థి చదవాల్సిన గ్రంథమని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని సరళంగా అర్థమయ్యేలా సాంకేతిక పదజాలం రూపొందిస్తున్న కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) కార్యక్రమాన్ని అభినందించారు. జామియా మిలియా ఇస్లామిక్ ప్రొఫెసర్ నవేద్ జమాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని విద్యార్థుల ముంగిటకు తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జెఎస్ రావత్, షజాద్ అహ్మద్ అన్సారీలు దేశవ్యాప్తంగా వచ్చిన రీసోర్స్ పర్సన్ల ప్రసంగాలు సమాచారపరంగా, ప్రేరణాత్మకంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అనంతరం సెమినార్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవీంద్ర సతీష్‌బాబు మాట్లాడారు. చివరగా పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు వైస్ చాన్సలర్ సర్టిఫికెట్లు అందించారు.

ఆరులేన్ల రహదారితో... ఆరుగంటలే ప్రయాణం!

● శరవేగంగా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు

● పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ భారం



యంత్రాలతో లెవలింగ్ చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే విజయవాడ నుంచి బెంగళూరుకు కేవలం ఆరు గంటల్లోనే ప్రయాణికులు గమ్యాన్ని చేరుకోవచ్చు. ఇక కడప జిల్లా వాసులు బెంగళూరు, విజయవాడ వెళ్లేందుకు రవాణా మార్గం మరింత సులభతరమవుతుంది. బెంగళూరుకు మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. వివరాల్లోకి వెళితే...



ఆరులేన్ల రహదారి నిర్మాణానికి గ్రావెల్‌ను చదను చేస్తున్న దృశ్యం

విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ (ఆరు లేన్ల) జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాలుగో ప్యాకేజీ కింద మల్లేపల్లె - నెల్లూరు- కడప జిల్లా సరిహద్దు వరకు రూ.622 కోట్లు నిధులతో సుమారు 20 కి.మీ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 14 ప్యాకేజీలుగా విభజించి పనులు జరుగుతున్నాయి. 2024 మార్చిలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. 2026 ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికే మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ గ్రామాలైన సీతారాంపురం కనుమలగుండా రహదారి నిర్మాణం ఊపందుకుంది. ఇప్పటికే 30 శాతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహ దారికి 132 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే 70 పూర్త య్యాయి. 68 కల్వర్టులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. సగిలేరు వద్ద రెండు పెద్ద బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయి. నాలుగు చిన్న బ్రిడ్జిలు, ఎల్‌సీఈ ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. చిన్నాయపల్లె వద్ద ముడుమాల, వెంకటాపురం, బద్వేలు రోడ్డు లైను అండర్ ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద ఒక ఎల్‌ఈపీ, చిన్నాయపల్లె వద్ద రెండు ఎల్‌ఈపీలు పనులు జరుగుతున్నాయి. టన్నెల్‌కు సంబంధించి 340 మీటర్లు అండర్ ప్రోగ్రెస్‌లో ఉంది. ఇంటర్ చేంజ్ గ్రీన్‌ఫీల్డ్ కోసం 1.50 కిలోమీటరుకు పెండింగులో ఉంది. దాదాపు 70 శాతం గ్రావెల్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తయితే ప్రకాశం- కడప - పులివెందుల మీదుగా నేరుగా బెంగళూరుకు చేరుకోవచ్చు.

ఇక ఈ పనులు పూర్తయితే చెన్నారెడ్డిపేట, మల్లేపల్లె, చాపాడు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు మీదుగా ఇంటర్ ఛేంజ్‌లు ఉంటాయి. దీంతో వాణిజ్య సమాచార, రవాణా కార్యకలాపాలు పెరుగుతాయి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పచ్చదనం పెంపునకు మొక్కలు నాటడం, ప్రకృతి గండాలు తగ్గింపు, టన్నెల్స్ ద్వారా అడవిని పరిరక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

గడువుకు ముందే పనులు పూర్తి

విజయవాడ - బెంగళూరు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు అనుకున్న గడువు కంటే ముందుగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆ దిశగా నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం. 2026 ఫిబ్రవరికి ఈ పనులు పూర్తవ్వాలి. కానీ అంతకు ముందే పనులు పూర్తి చేస్తాం.

- నాయబ్‌రసూల్, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు మేనేజరు

ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించాలి

జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు



యాప్ వినియోగంపై తర్ఫీదును పరిశీలిస్తున్న నిత్యానందరాజులు

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు నిత్యానందరాజులు అన్నారు. శుక్రవారం ఆయన వల్లూరు కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయాన్నే ప్రార్థనా సమయానికి చేరుకుని విద్యార్థులకు ప్రార్థనలు, గీతాలాపనలను ఆలపించే విధానాన్ని తెలిపారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. రాబోవు పదో తరగతి పరీక్షల్లో బాలికలు మంచి ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. ముఖ్యంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ హాస్టలులో మానిటరింగ్ యాప్‌ను ఎలా వినియోగించాలన్న అంశం పట్ల ప్రిన్సిపాల్‌కు తగిన సలహాలు ఇచ్చారు. జీసీడీవో డి.రూతు ఆరోగ్యమేరీ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఎలా మెలగాలో తర్ఫీదునిచ్చారు. అలాగే హాస్టలు మానిటరంగ్ యాప్ టెక్నికల్ టీంసభ్యుడు శివనాగేంద్రప్రసాద్ అక్కడు న్న అకౌంటెంట్‌కు యాప్‌ను ఎలా వినియోగించాలనే దానిపై తర్ఫీదు నిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



మురుగు కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో కొద్ది రోజులుగా విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఆ గ్రామంలో డీఎంహెచ్‌వో పర్యటించారు. గ్రామంలో విషజ్వరాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నివారించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న మురికికుంటల్లో గంభూషియా చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్లు కరిష్మా, శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టీపీపీ ఉద్యోగులు

ఎర్రగుంట్ల సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ ఉద్యోగుల, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. దీక్షలో వీరభద్రారెడ్డి, నారాయణ, సాంబశివారెడ్డి, రాము, రవిశేఖర్‌రెడ్డి మరి కొందరు కూర్చొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్టు కార్మికుల బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మహేశ్‌రెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కో చైర్మన్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు.. జేడీ



ముద్దనూరు: గోడౌన్‌లోని ఎరువుల బస్తాల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీ చంద్రానాయక్

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలకు యూరియా వాడుకోవాలని జేడీఏ చంద్రనాయక్ సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం జేడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంటల వివరాలు, యూరియా పంపిణీ, ధరల వివరాలపై దుకాణదారులు ఇబ్బంది కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఎరువుల దుకాణాల్లో నిల్వ చేసిన ఎరువులు, పురుగుల మందులు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, అమ్మిన ప్రతి ఎరువు బస్తాకు బిల్లులు అందించాలని సూచించారు. అలాగే అగ్రీల్యాబ్, వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక యూరియాతో భూసారం దెబ్బతింటుంది

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో యూరియా వాడడం వలన భూమి సారవంతం కోల్పోయి పంటల దిగుబడులు తగ్గిపోతాయని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులలు చంద్రానాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఇ.కొత్తపల్లె రైతు సేవా కేంద్రం లో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూరియాను పంటలకు ఒకేసారి వేయకుండా దశలవారీగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని ఓ ఎరువుల దుకాణాన్ని పరిశీలించి నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. అలాగే తొండూరు మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. ఎక్కువ ధరలకు యూరియాను విక్రయించకూడదన్నారు. మండల వ్యసాయాధికారి రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమ వాస్య సందర్భంగా పుష్పగిరికొండపై ఉన్న రుద్రపాదం వద్ద ఈ నెల 21 ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకట సుబ్బారెడ్డి, ఈవో శ్రీనివా సులు తెలిపారు. దక్షిణా కాశిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో కొండపైన పంచమనదీ తీర్థం వద్ద సాక్షాత్తు పరమేశ్వరుడు స్వయంగా పాదం మోపిన రుద్రపాదం వద్ద పితృదేవతల ఆత్మ సంతృప్తి, స్వర్గలోక మోక్ష ప్రాప్తికోసం పితృదేవతలకు మహాల య అమా వాస్యరోజు పిండ ప్రదానం చేస్తే చాలా మంచిదన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసంవత్సరం కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు పంచ టవల్, చెంబు, రెండు గ్లాసులు, ఉద్దరణి లేదా పాత్ర, యజ్ఞోప వీతం (జంధ్యం) తదితర వస్తువులు తీసుకు రావాలన్నారు. పిండ ప్రదా నం కింద కూర్చుని చేయలేని వారి కోసం టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం వారు పసుపు, కుంకుమ, పూలు, బియ్యం పిండి, నువ్వులు ఇతర సామగ్రి అందజేస్తాన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నిబంధనలు పాటించని ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్

దువ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో నిబంధనలు పాటించని నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను శుక్రవారం వైద్య శాఖ సీజ్ చేసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ ప్రైవేటు క్లీనిక్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికిత్సలకు వచ్చే రోగులకు పరిమితికి మించి యాంటిబయాటిక్స్ వాడకం, సెలెన్ బాటిళ్లు ఎక్కించడంతోపాటు వాడిన వైద్యసామగ్రిని క్లినిక్‌లలో కనుగొన్నారు. సరైన అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగులకు ప్రమాదకరమని ఆయన వెల్లడించారు. స్థానికంగా ఉన్న శివప్రసాద్, శ్రీనివాసులు, షబ్బీర్, తాహిర్‌హుస్సేన్ అనే వ్యక్తులు నిర్వహిస్తున్న సదరు క్లినిక్‌లను సీజ్ చేశారు. స్థానికంగా చంద్ర క్లినిక్‌పై తనిఖీకి వెళ్లగా ఆస్పత్రి మూసివేసి ఫోన్ చేసినా అధికారులకు నిర్వాహకులు స్పందించలేదు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

కొండాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద నున్న సోలార్ కంపెనీలో జరిగిన దొంగతనం కేసులో శుక్రవారం పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. సోలార్ కంపెనీకి చెందిన రూ.24 లక్షలు విలువైన బ్యాటరీలు, వైరు దొంగతనం చేసినందుకు నలుగురిని అరెస్టు చేసినట్లు కొండాపురం సీఐ రాజా, తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు వారు తెలిపారు.

నంది విగ్రహం చోరీ



వినాయక విగ్రహం ఎదుట ఉన్న నంది విగ్రహం (ఫైల్), చోరీ తర్వాత ఏర్పడిన గొయ్యి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత సంగటిపల్లె లోని నరసింహస్వామి ఆలయంలో నంది విగ్రహం చోరీకి గురైంది. అతి పురాతన నరసింహస్వామి గుడి ఆవరణలో వినాయక స్వామి విగ్రహం ముందున్న నంది విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఈవో శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ చల్లనిదొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గుప్త నిధులకోసం నంది విగ్రహాన్ని దొంగలించి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఇప్పటికే పోలీసుల అదుపులో కొందరు ఉన్నట్లు సమాచారం.

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు : ఆర్డీవో



మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కడప రెవెన్యూ డివి జనల్ అధికారి జాన్ ఇర్విన్ హెచ్చరిం చారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ, అడ్వజరీ సమావేశం డీఐఓ, పీసీఅండ్ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగ వివక్షత చట్ట రీత్యా నేర మన్నారు. కడప డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. లింగ వివక్షకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ ఆసుపత్రుల పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగ న్వాడీ సెంటర్స్ పరిధిలోని గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు గర్భస్థ పూర్వ మరియు పిండ లింగనిర్ధారణ చట్టం, ఆడబిడ్డల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ రబ్బానీ మాట్లాడుతూ ఆడబిడ్డలు కలిగిన గర్భిణులు కాన్పు వరకు వారు ఎక్కడ డెలి వరీకి పోతున్నారు, స్కానింగ్ పరీక్షలు ఎక్కడ చేయించుకున్నారనే విషయాలను గమనించాలన్నారు. అంగన్వాడీ టీచర్ ద్వారా ఆడబిడ్డ ప్రాముఖ్యత, వివాహ వయస్సు, బాల్యవివాహాలు గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఏసీడీపీవో శోభారాణి, డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, రేడియోలజిస్ట్, డాక్టర్ బాలకృష్ణ, తాలూకా సీఐ రెడ్డప్ప, డెమో భారతి, రమ ణమ్మ, డీహెచ్‌వో కుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు



రైఫిల్ షూటింగ్‌లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 రైఫిల్‌షూటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్‌సైట్, పీప్‌సైట్, పిస్టల్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జార్జిక్లబ్ కార్యదర్శి మార్తల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, కోఆర్డినేటర్లు ప్రవీణ్‌కిరణ్, రాఘవేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్‌పై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): కడప రిమ్స్ దంత వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసరు చక్రపాణిపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రిమ్స్ డెంటల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేస్తున్న చక్రపాణి ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. కళాశాల ప్రిన్సి పాల్ జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయి. ఎంసెట్ ద్వారా ర్యాంకు సాధించిన విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ కౌన్సిలింగ్ నిర్వహించి కళాశాలలను కేటాయించింది. ఈ మేరకు విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల అధ్యాపకులు తనిఖీ చేసి కళాశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు రోజులపాటు అడ్మిషన్లు కొనసాగుతాయని, మొదటిరోజు 22 మంది విద్యార్థులు కళాశాలలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి ప్రజ్ఞ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం: చమర్తి

సుండుపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యమని రాజం పేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్ మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం మండ లంలోని తిమ్మసముద్రం, బలిజపల్లి గ్రామాల్లో కొత్త రేషన్ కార్డులు (స్మార్ట్ కార్డులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రాజు మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్ తో బియ్యం పంపిణీ చేసేందుకు అనుగుణం గా ప్రభుత్వం స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిందన్నారు. రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్య లు తీసుకుంటోందని వివరించారు. ప్రతి ఇంటికి వచ్చి రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు స్మార్ట్ కార్డులను అందజేస్తారని, కార్డుల పంపిణీ జరిగేంతవరకు పాత రేషన్‌కార్డులతోనే నిత్యావసర సరుకులు తీసుకోవచ్చునన్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఆర్‌ఐ జ్యోతి, టీడీపీ మండల అధ్యక్షులు రెడ్డెప్ప, తిమ్మసముద్రం గ్రామ అధ్యక్షులు శివరామకృష్ణయ్య, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

పాడి పరిశ్రమ అభివృద్ధికి గోకులాలు

మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీలో మినీ గోకులాలను రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. 90 శాతం సబ్సిడీతో గోకులాలను నిర్మించడం ఆవులు, గొర్రెలు, గేదెలు పెంచే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుం దన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. అవసరమైతే మరిన్ని గోకులాలను మంజూరు చేసేందుకు సిద్ధం గా ఉందన్నారు. అనంతరం పశువులకు గాలికుంటు నివా రణ టీకాలను వేయించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, బీజేపీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

8వ పే కమిటీ మెంబర్స్‌ను వెంటనే ప్రకటించాలి



కేంద్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే కార్మికులు

నందలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్ మెంబర్లను వెంటనే ప్రకటించాలంటూ శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా యూనియన్ స్థానిక కార్యదర్శి విశ్వ నాథ్ మాట్లాడుతూ జనవరిలో 8వ పే కమిషన్‌ను వేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం 9 నెలలు గడుస్తున్నా పేర్లను ప్రకటించకపోవడం దారుణ మని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 2025లో కమిటీని ప్రకటించి ఉంటే జనవరి 2026 నుంచి భారతదేశంలో పనిచేస్తున్న అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పే కమిషన్ ఫలాలు అందేవని వాపో యారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ సెక్రటరీలు ప్రకాశం, ఆకుల నాగరాజు, రైల్వేఇన్‌స్టిట్యూట్ సెక్రటరి సాయిసందీప్, ట్రెజరర్ షేక్ షావలి తదితరులు కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి తమ నిరసనను తెలియజేశారు.

అంటువ్యాధులపై కళాజాతా

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుగుంటపల్లి గ్రామంలో శుక్ర వారం సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కౌట్స్‌తో క్రమశిక్షణ, దేశభక్తి



రాయచోటి: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న స్కౌట్స్ అధికారులు

చిట్వేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ; దేశభక్తి పెంపొందించడమే లక్ష్యమని చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్న పత్రాలను విడుదల చేసిన తర్వాత ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, నైతిక విలువలు పెంపొందడానికి స్కౌటిజం తోడ్పడుతుందన్నారు. అనంతరం స్కౌట్ మాస్టర్ గైడ్ కెప్టెన్ ఎం.నవీన్‌కుమార్, బి.శిల్పకళ మాట్లాడుతూ తమ పాఠశాలలో 24 మంది స్కౌట్స్ విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు. వీరికి మరో ఆరు నెలల శిక్షణ అనంతరం మార్చిలో ప్రథమ సోపాన్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్కౌట్‌మాస్టర్లు ఎం.నవీన్‌కుమార్, గైడ్ కెప్టెన్లు బి.శిల్పకళ, ఉపాధ్యాయులు శివనారాయణగౌడ్, గీతారాణి, సుహాసిని, సునీత, మహమ్మద్‌రఫీ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి (నేతాజీ సర్కిల్) : సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో విద్యా ర్థులకు స్కౌట్ మాస్టర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న 44 మంది బాలురు, 20 మంది బాలికలు, 64 మంది విద్యార్థులకు స్కౌట్ మాస్టర్ మురళీనాయక్ పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ షామీర్, గైడ్ కెప్టెన్ శశికళ పర్యవేక్షించారు.

కార్తీక వనభోజనాల కరపత్రం విడుదల

ఒంటిమిట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2న నిర్వహించనున్న కార్తీక మాస వనభోజన మహోత్సవ కరపత్రాన్ని శుక్రవారం కడపలోని బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ వంశస్థులైన ముగ్గురాళ్ల అమరప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బలిజలు కుటుంబ సమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో బీజేపీ నేతలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 19: స్వస్థ నారి - సశక్త పరివార్ అభియాన్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా పక్షం రోజుల పాటు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాయచోటిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ హాజరయ్యారు. ఈ శిబిరంలో పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీదేవపట్ల హరినాథరెడ్డి డిగ్రీ కళాశాల, సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు, టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు రక్తదానం చేశారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ బండారు కిరణ్‌కుమార్‌లతో పాటు పలువురు వైద్యులు హాజరయ్యారు.

వంట ఏజెన్సీలకు బకాయిలు చెల్లించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న వంట ఏజెన్సీల నిర్వాహకులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలకు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన వంట ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి డీఆర్‌వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలన్నారు. స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుతో కార్మికుల ఉపాధికి గండి పడుతుందని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీల నిర్వాహకులు జయన్న, అమీర్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానవ హక్కులను తెలుసుకోవాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు మానవ హక్కులను తెలుసుకోవాలని ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు. శుక్రవారం హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను, తెలుగు భాష విశిష్టత ఆవశ్యత, వృత్తి నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ ప్రసన్నకుమార్, మహిళా విభాగం చైర్‌పర్సన్ మాలతి, కడప అన్నమయ్య జిల్లాల చైర్మన్‌లు డేవిడ్, కళ్యాణ్‌రాజ్, సాయి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంటకు సత్కారం



పోతుగుంట రమేష్‌నాయుడును సన్మానిస్తున్న నేతలు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్‌గా రాజంపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడును ఎంపిక చేయడంతో శుక్రవారం పలువురు కూటమి పార్టీ లకు చెందిన నాయకులు, కార్యకర్తలు రాజంపేటకు చేరుకుని ఆయనను ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ మహాశివుడికి సేవ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, ఉద్దండం సుబ్రమణ్యం, బీజేపీ సీనియర్ నాయకులు హిమగిరియాదవ్, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.పాపయ్య, నాగరాజు, గిరీష్, బీజేపీ నాయకులు సురేష్‌రాజు, శ్రీనివాసులు, పత్తిపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్‌ల పంపిణీ



గర్భిణులకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఒంటిమిట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు పోషకాహారంతో పలు ఉపయోగాలు ఉన్నాయని మండల వైద్యాధికారులు డాక్టర్ భావన, డాక్టర్ అరుణజ్యోతిలు పేర్కొన్నారు. శుక్రవారం పెన్నపేరూరు గ్రామంలో సర్పంచ్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో స్వస్థ నారి సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లలకు వ్యాక్సీనేషన్ తప్పక వేయించాలన్నారు. అనం తరం గర్భిణులకు, పన్ను కంటి పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు, సికిల్ సెల్ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ పోషకాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌వోలు హవిల, చంద్రిక, శిరీషా, ఆరోగ్య కార్యకర్తలు, రేష్మ, సోనీ, నాగమణి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు వంటల పోటీలు

చిట్వేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోషన్ మా కార్యక్రమంలో భాగంగా చిట్వేలి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషకాహార వంటల పోటీల్లో పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు పోషకాహారంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో నిర్మల జ్యోతి మాట్లాడుతూ పోషకాహార విలువలు, కుటుంబ సభ్యుల ఆరోగ్యంలో తండ్రుల పాత్ర ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, సురేఖరాణి, విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ఏరియాలో శుక్రవారం సస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, పీహెచ్‌ఎన్ శైలజా, ఆరోగ్య కార్యకర్త మధుసూదన్‌రెడ్డి, 104 సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



చిట్వేలి: క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

చిట్వేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మండల తహసీల్దారు స్పందన, విద్యా శాఖాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో క్రీడా పోటీలను మండల విద్యాశాఖాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దొరకరాజు మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఓడిపోయినవారు నిరుత్సాహ పడకుండా గెలుపుకోసం పట్టుదలతో శ్రమించాలన్నారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రభుత్వం ఉన్నతచదువుతోపాటు ఉద్యోగావకాశాలుకల్పిస్తుందని తెలిపారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) మండల కోఆర్డినేటర్ గౌరి ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారం భమయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్ష తన నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 14-17 సంవత్సరాల లోపు బాల బాలికల తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. మొదటిరోజున కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని కోఆర్డినేటర్ గౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరికిరణ్, ఉజాల విజయ్‌కుమారి, గీతా, రమణ, జ్యోతిప్రియ, ప్రసాద్‌రావు, గాయత్రిదేవి, డాక్టర్ శర్వాణి, షాకీర్‌హుస్సేన్, పెంచలయ్య, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఔషధాల రూపకల్పనపై అవగాహన



శ్రీనివాసులును సత్కరిస్తున్న అన్నమాచార్య యూనివర్శిటీ ప్రొఫెసర్‌లు

రాజంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఔషదాల రూపకల్పనపై శుక్రవారం రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్ట్రేలియాలోని కాలహాన్ న్యూసౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆసాది శ్రీనివాసులు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎం.సుబ్బారావు, కోఆర్డినేటర్ నవీన్‌కుమార్, తది తరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో ఆరోగ్య రంగంలో కొత్త ఔషధాల రూపకల్పన, రోగ నిర్ధారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా న్యూసౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీనివాసులును అన్నమాచార్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌లు సత్కరించారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రైల్వేకోడూరు ఐసీడీఎస్ సీడీపీవో రేణుక తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, బాల బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. శరీరానికి పోషకాలు సరిగా అందినపుడు రోగాలు దరిచేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో సరళదేవి, సూపర్వైజర్ సుబ్బలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది శిరీష తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి కుట్టు యంత్రం అందజేత



కుట్టుమిషన్ అందజేస్తున్న కానాల భయ్యారెడ్డి

గాలివీడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా పాఠశాలకు కానాల ఇరగమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడుభయ్యారెడ్డి శుక్రవారం కుట్టుయంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగరాజు మాట్లాడుతూ మండలంలోని ఎంతో మంది పేద విద్యార్థులకు ట్రస్ట్ సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ కళాశాలలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామాపురం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పరిధిలోని బిట్స్ కళాశాలలో శుక్రవారం రాయచోటి పట్టణానికి చెందిన అగర్వాల్ ఆసుపత్రి వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ , కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్ యార్డులో సంత నిర్వహణ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో శనివారం నుంచి పశువులు, కూరగాయలు సంత నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌యండీ షఫీనాయక్ తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డులో కొంత మంది కూటమి నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్లుగా అధ్వానంగా మారిన లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌యార్డును మెరుగుపరిచేందుకే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనకు బాధ్యతలు అప్పజెప్పారని తెలిపారు. సంతలు ఏర్పాటు చేస్తే మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిరేవుల సొసైటీ చైర్మన్ దేవానందరెడ్డి, టీడీపీ నాయకులు సుధీర్‌బాబు, జనార్దన్‌రెడ్డి, వెంకట్రమణ, యనమల విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజా చైతన్య సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, ఓఆర్‌డబ్ల్యు విజయలక్ష్మి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ప్రజా చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హాస్పిటల్‌లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఈ సంపూర్ణ, ఐసీటీసీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటాం'



ఆక్రమిత స్థలాన్ని చదును చేయిస్తున్న కమిటీ సభ్యులు

చిట్వేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటామని చిట్వేలి సోమేశ్వరాలయం కమిటీ చైర్మన్ వీరాంజనేయులు, ఆర్గనైజర్ బొంతల నాగేశ్వరరావు, సభ్యులు మోహన్ అన్నారు. శుక్ర వారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ స్థులు ధర్మనిధి అఖండ సభ్యుల ఆధ్వర్యంలో శివాలయం ఆవరణలో ఆక్రమ ణకు గురైన స్థలాన్ని ఎక్స్‌కవేటర్లతో చదును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేసి పరిరక్షించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మనిధి అఖండ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలి



ర్యాలీ చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీల పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాయచోటి పట్టణంలో ర్యాలీ , తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చిన నారా లోకేశ్ హామీలను అమలు మరచిపోయారరు. సూపర్ హిట్ సుపరిపాలన అంటు సంబరాలు చేసుకుంటున్నారే కానీ విద్యార్థుల కష్టాలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ రాయచోటి పట్టణ నాయకులు లోకేశ్, సాయి, ఆరీఫుల్లా, మహమ్మద్, సురేశ్, నారాయణ పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని ఎమ్మెల్యేలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని, రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూల భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లక పోవడం బాధాకరమన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డితో సహా 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఉండడం సిగ్గుచేటు అన్నారు. వీరందరూ తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

బీజేపీ నేతల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



చెత్తను తొలగిస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం బీజేపీ నాయకులు కోడూరు పట్టణంలోని పగడాలపల్లి, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో బీజేపీ మండల అధ్యక్షులు సాయిం శ్రీధర్ ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు. బీజేపీ నాయకులు తోట శ్రీనివాసులు, వాకచర్ల సుబ్బరావు, మహిళ నాయకురాలు కొప్పాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రంగనాయకస్వామి

చిట్వేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో స్వామివారు శుక్రవారం ప్రత్యే అలంకరణలో దర్శనమిచ్చారు. అఖండజ్యోతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పాదుకలను ప్రదర్శించారు.

పట్టుదొరికేనా..?

- గత ప్రభుత్వ పాపం.. పట్టురైతుల పాలిట శాపం
- నేడు ధరలు పెరిగినా.. ఆసక్తి చూపని రైతన్నలు

రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం.. పట్టు రైతుల పాలిట శాపంగా మారింది. ఒకప్పుడు పడమటి ప్రాంత మండలాల్లో భారీగా పట్టు సాగు చేసే వారు. కరోనా సమయంలో పట్టు ధరలు విపరీతంగా తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టు రైతులను పట్టించుకోలేదు. దీంతో రైతన్నలు అప్పులపాలై అయోమయ స్థితిలో పడ్డారు. ఆ దెబ్బ నుంచి రైతులు ఇప్పటికీ కోలుకోలేకున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం పట్టు రైతులను ప్రోత్సహించడానికి కనీస సౌకర్యాలు, రాయితీలు కల్పించలేదు. దీంతో చాలామంది రైతులు పట్టు సాగును మానుకుని ఇతర పంటలవైపు మళ్లారు.

కురబలకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో ప్రధాన జీవన వనరు వ్యవసాయమే. ఇక్కడి రైతులు టమోటా, వేరుశెనగ, ఉల్లి పంటలతో పాటు పట్టు పంట సాగు చేస్తారు. మిగతా పంటల మాదిరిగా కాకుండా పట్టు పంటకు నికర ఆదాయం దక్కుతుంది. దీంతో అన్ని సమయాల్లో లాభాలను ఆర్జించవచ్చు. అయితే కరోనా సమయంలో విపరీతంగా నష్టాలను చవిచూడడంతో చాలా మంది రైతులు పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపలేదు. అనంతరం పలుమార్లు పంటలకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రధానంగా వేసవిలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు లాభాలు ఆర్జించవచ్చునని ఆశించినా.. అలా జరగలేదు. ధరల్లేక నష్టపోయారు.

మార్కెట్ సౌకర్యం లేదు

వర్షాకాలం మినహా మిగిలిన అన్ని సమయాల్లో పంటను ఎక్కువగా సాగుచేస్తారు. షాకీ కేంద్రం నుంచి మట్టి పురుగులు తెచ్చి పంటను సాగు చేస్తారు. ఈ పంట చేతికి అందడానికి శీతాకాలంలో నెల రోజులు, వేసవిలో దాదాపుగా 25రోజులు పడుతుంది. కాగా కొన్ని సమయాల్లో పంట పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. అయినా కష్టపడి సాగుచేస్తున్నారు. అయితే ఇక్కడ మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది కర్ణాటకలోని చింతామణి, కోలార్, సిల్లగట్టు తదితర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు. దీంతో వీరికి ఖర్చు ఎక్కువగా వస్తోంది. మార్కెట్‌లో మొదటి రకం పట్టు గూళ్ల కిలో అప్పట్లో రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది.

వైసీపీ హయాంలో అందని రాయితీ

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అమలు కాలేదు. గతంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి షెడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేసేవారు. ఇందులో కేంద్రప్రభుత్వం 50శాతం రాయితీ, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ, మిగిలిన 25శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. షెడ్డు నిర్మాణం పూర్తయిన వారం రోజుల్లో రాయితీ సొమ్ము జమ అయ్యేది. అయితే షెడ్డు నిర్మాణాలు చేపట్టిన కొంతమంది రైతులకు రెండు, మూడు ఏళ్ల అనంతరం రాయితీ చెల్లించారు. చాలా మంది రైతులకు ఇప్పటికీ రాయితీ నిధులు జమకాలేదు. 2019కి మునుపు బైవోల్టిన్ రకం పట్టు సాగుకు కిలోకు రూ.50 ప్రోత్సాహకాన్ని అందించేవారు. ఆ రాయితీని వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ఆపేశారు. గతంలో ప్రతి మండలానికి రైతుల సమస్యలు తీర్చడానికి ఇన్‌స్పెక్టర్, టీఏలు ఉండేవారు. చాలామంది పదవీ ఇరమణ పొందడంతో 15మండలాలకు ఒక అధికారితో కాలం వెల్లదీశారు. ఇవి కూడా పట్టు సాగు తగ్గడానికి కారణాలు.

ధరలు పెరిగినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టు ధరలు భారీగా పెరిగాయి. అయినా రైతులు పట్టును సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌లో మొదటి రకం రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం రూ.700 నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.600 నుంచి రూ.650 ఉంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే ముందులాగా పట్టుసాగు పెరిగే అవకాశం ఉంది. అలాగే పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. లేదంటే జిల్లాలో పట్టుసాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.


రైతులు సాగు చేసిన మల్బరీ పంట


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పట్టుగూళ్లు

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

27 ఏళ్లుగా పట్టును సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. మా ప్రాంతంలో దిగుబడి చేసిన పంటను కర్ణాటకాలోని సిల్లగట్టుకు తరలించి విక్రయిస్తాము. మాకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవంతో 130 కిలోమీటర్ల దూరం తరలించాల్సి వస్తోంది. దీంతో పంటను తరలించడానికి ఖర్చు ఎక్కువగా రావడంతో పాటు సమయం వృదా అవుతుంది. మాకు ఇక్కడే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. లోకల్ మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పట్టుకు సకాలంలో నగదు చెల్లించాలి.



- గుణశేఖర్ రెడ్డి, రైతు, మట్లివారిపల్లె, కురబలకోట మండలం

వాహనం సహా ఎర్రచందనం పట్టివేత


పట్టుబడిన వాహనంతో పాటు స్మగ్లర్‌ను అరెస్ట్ చూపుతున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. అత్యంత రహస్య సమాచారం మేరకు యల్లమంద - పీలేరు మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఏపీ29 ఏజీ0959 నెంబరు ఇన్నోవా అతివేగంగా వచ్చిందన్నారు. వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న ఐదు ఎర్రచందనం దుంగలు, తమిళనాడుకు చెందిన ఓ స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన స్మగ్లర్, వాహనం సహా ఎర్రచందనం పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. ఎర్రచందనం, వాహనం విలువ రూ. 8.50 లక్షలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ దాడితో ఎఫ్ఆర్ఓ ఎస్.చంద్రశేఖర్, సెక్షన్ అధికారి ప్రకాష్‌కుమార్, బీట్ ఆఫీసర్లు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్, పారెప్ప, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాగేనీరు అనుకుని విషద్రావణం సేవించి చిన్నారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సిరికల్చర్ కాలనీలో చోటు చేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే... మదనపల్లె పట్టణం, సైదాపేటలో కాపురం ఉంటూ సిరికల్చర్ కాలనీలో పట్టు గూళ్ల రీలింగ్ సెంటర్‌లో కూలిగా షాదియా పనిచేస్తోంది. ఈమె భర్త కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులో కూలీ పనులు చేసుకుంటుండడంతో రోజూ రెండేళ్ల కుమార్తె అలియాతో కలిసి పనికి వెళ్లేది. ఈ క్రమంలో తల్లిపని చేసుకుంటున్న సమయంలో అక్కడే ఆడుకుంటున్న చిన్నారి నీళ్లు అనుకుని రీలింగ్ సెంటర్‌లో ఉంచిన విషద్రావణం సేవించి స్పృహ కోల్పోయింది. గమనించిన రీలింగ్ సెంటర్ యాజమాని, తల్లి స్వర్ణకుమారి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో చిన్నారి అలియా మృతి చెందింది. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్...


మృతిచెందిన వాచ్‌మన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, బసిని కొండ జడ్పీ హైస్కూల్ వాచ్‌మన్ శ్రీనివాసులు (60) మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. శ్రీనివాసులు తన మనుమరాలు తరుణికను బైక్‌లో కూర్చోబెట్టుకుని స్కూల్ నుంచి ఇంటికి శుక్రవారం సాయంత్రం బయలుదేరాడు. పుంగనూరు బైపాస్ రోడ్డు, సాయిబాబా ఆలయం వద్ద పుంగనూరు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీనివాసులు, మనుమరాలు గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు శ్రీనివాసులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అమరావతి, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్యకేసుగా పోలీసుల దర్యాప్తు


రీ పోస్టుమార్టం కోసం తవ్వుతున్న అధికారులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో అదృశ్యమైన వ్యక్తి కేసును హత్య కేసుగా మదనపల్లె టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేసి శుక్రవారం రీ పోస్టు మార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీకి చెందిన జరిపిటి రామన్న (40) ఈ ఏడాది మార్చి 12న అదృశ్యయ్యాడు. తన సోదరుడు హనుమంతు ఫిర్యాదుతో ఈ ఏడాది జూన్ 21న మదనపల్లె రెండో పట్టణ పోలీసులు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి భార్య రమణమ్మ, ఆమె సోదరుడు ఈశ్వర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తమ్ముడు హనుమంతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి వారు ఇరువురు పరారీలో ఉండడంతో అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడంతో రామన్న హత్య వెలుగులోకి వచ్చింది. వారి వివరాల మేరకు బి.కొత్తకోట మండలం, కస్తూర్బా పాఠశాల సమీపంలోని హంద్రీనీవా కాల్వ వద్ద పూడ్చిన రామన్న మృతదేహాన్ని వెలికితీసి అక్కడికక్కడే శవ పరీక్షలు నిర్వహించారు. సీఐ రాజారెడ్డి ఈ కేసును హత్య కేసుగా నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంప్ వెండర్స్ నిరసన

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ కోసం కొత్తగా తీసుకొచ్చిన ఓటీపీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా లేఖరుల పెన్ డౌన్‌లో భాగంగా పీలేరులో నిరసన తెలిపారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశ పెట్టిన కొన్ని విధానాలతో తీవ్ర జాప్యం నెలకొంటోందని ఆరోపించారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీ అనేది జఠిలంగా మారుతోందన్నారు. అటు ప్రజలు ఇటు దస్తావేజుల లేఖరులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వానికి తెలియజేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చలపతి, స్టాంపుల మస్తాన్, మురళి, నరసింహారెడ్డి, ఖాదర్‌వల్లీ, రజాక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ- నగదు అపహరణ

వాల్మీకిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి వాల్మీకిపురం పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. ఎండోమెంట్ ఈఓ అధికారుల ఫిర్యాదు మేరకు వివరాలిలా... పట్టణ సమీపంలోని నిమ్మనపల్లె మార్గంలో వెలసిన పురాతన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశిస్తూ తొలుత సీసీ కెమెరాల పరికరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆలయంలోకి చొరబడి వెండి కిరీటం, హుండీ నగదు, సీసీ పుటేజి పరికరాలను అపహరించుకుపోయారు. కొత్తగా ప్రారంభమైన నాలుగు వరుసల రహదారి పక్కగా ఉన్న దేవాలయంలో ఈ చోరీ సంఘటన చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం విషయాన్ని గ్రహించిన ఈఓ మంజుల ఆలయానికి చేరుకుని పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన అనంతరం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపి ఆలయ పరిసరాల్లో పరిశీలన చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


కుక్కదాడిలో గాయపడిన చిన్నారి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేసి చిన్నారిని గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, వలసపల్లె గ్రామం డ్రైవర్స్ కాలనీకి చెందిన మహేష్, గంగోత్రి దంపతుల కుమారుడు తరుణ్ శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే గాయపడిన కుమారుడుని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల ప్రభావం అధికంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒకరి అరెస్టు


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కె.వి.బావి బీట్ వద్ద శుక్రవారం 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్వో శ్యాంసుందర్ తెలిపారు. కె.వి.బావి బీట్‌లో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వారిపై దాడి చేసి తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేశ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు మోహన్‌కుమార్, జనార్దన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న డీఈఈ, తహసీల్దార్

రామసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ అజారుద్దీన్, విద్యుత్ డీఈఈ హరికుమార్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని, నడింపల్లె రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉండగా వాటికింద వ్యవసాయ సర్వీసులు 13 వేలు ఉన్నాయన్నారు. వీటికి సరిపడా విద్యుత్ సరఫరా తక్కువగా ఉండడం వల్ల నూతన సబ్‌స్టేషన్ నిర్మించి వ్యవసాయానికి నిరంతరంగా 9గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఈఈ మస్తాన్, ఆర్ఐ వసీం, వీఆర్వో రెహమాన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలానికి చెందిన గ్రామ సర్వేయరు గుడి అశోక్‌కుమార్‌పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ చిన్నమండెం-1 గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తూ అదే మండలంలోని మల్లూరు గ్రామంలోని సర్వే నెం.1186, 1187లోని 6.39 ఎకరాలను విడగొట్టి మల్లూరు గ్రామం కొత్తపల్లె ఎస్సీ కుటుంబానికి చెందిన రైతుల పేరుతో నాలుగు భాగాలుగా సర్వే చేసి చిత్రపటాలు తయారు చేయడానికి రూ.60 వేలు డిమాండు చేశాడనే అభియోగాలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదు చేసింది. డిమాండు మేరకు రూ.60 వేలు ఇస్తేగానీ సర్వే చేయనని అశోక్‌కుమార్ భీష్మించుకోవడంతో 2023 జనవరి 6న ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరుకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కుటుంబంలోని నలుగురి పేరుతో ఆ భూమిని పట్టాలు ఇవ్వడానికి జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా లభించి జిల్లా కలెక్టరు పట్టాలు కూడా జారీ చేశారు. దీన్ని సబ్ డివిజన్ చేయాల్సిన దశలో అశోక్‌కుమార్ మెలిక పెట్టారు. చివరకు పని పూర్తయిందని రూ.60 వేలు తీసుకురావాలని సర్వేయర్ రైతులను పిలిపించుకున్నాడు. అయితే అంత మొత్తం ఇవ్వలేక మూడు రోజుల తరువాత వస్తామని రైతులు తిరిగి వెళ్లిపోయారు. సర్వేయర్ ఫోన్ కాల్స్‌కు సంబంధించిన రెండు మెమొరీ కార్డులను జతచేస్తూ రైతులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు 2023 ఏప్రిల్ 4న కేసు నమోదు చేసి కడప ఏసీబీ ఇన్‌స్పెక్టరు ఇ.కృష్ణమోహన్ దర్యాప్తు చేపట్టారు. అప్పటి కొత్తపల్లె వీఆర్వో పి.నాగేశ్వరి, చిన్నమండెం తహసీల్దారు ఎం.శ్రీరాములు నాయక్, మరో తహసీల్దారు సి.నరసింహులు, డిప్యుటేషన్‌పై పనిచేసిన పీలేరు స్పెషల్ సర్వేయర్ కె.లోకేశ్వరిలను విచారించి మొత్తం వ్యవహారంపై వాంగ్మూలాలు నమోదు చేశారు. నలుగురు రైతుల సాక్ష్యాలను నమోదు చేసింది. దీనికి ప్రధాన ఆధారంగా లంచం డిమాండు చేస్తూ అశోక్‌కుమార్ ఫోను చేసిన 3 నిముషాల 24 సెకండ్ల నిడివిగల ఆడియో రికార్డింగ్‌ను ఏసీబీ జతచేసింది. సర్వేయర్ అశోక్‌కుమార్ లంచం డిమాండు చేయడానికున్న అన్ని అవకాశాలను ఏసీబీ పకడ్బందీగా విశదీకరించింది. మొత్తం మీద 2025 ఏప్రిల్ 30న ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీనిపై ప్రభుత్వం విచారణ చేయించి చర్యలు తీసుకునేందుకు నిర్ణయించిన దరిమిలా సర్వేయర్ అశోక్‌కుమార్‌కు 20 పేజీల చార్జి నోటీసును జారీ చేసింది. 10 రోజుల్లోగా వివరణ సమర్పించుకోవడం కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు ప్రోత్సాహం

- పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు నాగార్జున, శంకరప్ప

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పరిశ్రమల స్థాపనకు ,అభివృద్ధికి, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి ఉపయోగపడుతుందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు కె.నాగార్జున, శంకరప్ప తెలిపారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఎంఎస్ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, వ్యాపారం సులభతరం చేయడానికి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి, సర్టిఫికెట్ అందజేశారు ఈ సందర్భంగా గ్లోబల్ సర్వీసెస్ ట్రస్టు చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ మంచి ప్రణాళికతో ముద్ర రుణాలు, పీఎంఈజీపీ లోన్లు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఏటీఎం మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఆహార ఉత్పత్తిరంగంలో సబ్సిడీ లభిస్తుందని, ముద్ర పీఎంఈజీపీ ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు మాట్లాడుతూ ఈ వర్క్‌షాపునకు హాజరైనవారిలో 60 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 50 మంది మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు పి.దామోదర్, ఎం.హరిబాబు, సీవీ సుబ్బమ్మ, పి.గోవిందమ్మ, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం కోటకొండలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా 15 నుంచి అక్టోబరు 15 వరకు పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తారన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి నురగ రావడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ శిబిరంలో 186 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 210 పశువులకు బ్లూటాక్స్ పిచికారీ చేశామన్నారు. 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 56 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సుమిత్ర, మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, కూటమి నాయకులు రెడ్డప్ప, రాజేష్, సిబ్బంది హేమాపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. సోంపల్లె పెద్దచెరువు నిండి కోనేటివారిపల్లె మీదుగా మొరవపోతుండంతో శుక్రవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు మొరవపోతున్న, వాగులు ఉన్న సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది కలిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రాత్రంతా కోనేటివారిపల్లెలో పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచుతున్నామన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవన్నారు. కాగా మొరవ నీరు కోనేటివారిపల్లెలోని ఓ ఇంట్లోకి వస్తుడడంతో ఖాళీ చేయించి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లోకి పంపారు. ఆయన వెంట సీఐ వెంకటేశులు, ఎస్ఐ నరసింహుడు తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- వైసీపీ శ్రేణుల ధర్నా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని అలా కాకుండా ప్రైవేటుకు దారాదత్తం చేస్తే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకూడూరు నుంచి వేలాదిగా వైసీపీ శ్రేణులు తరలిరావాలని ఇచ్చిన పిలుపునకు కేవలం 500 మాత్రమే ధర్నాకు రావడం విశేషం. రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, తిరుపతి నుంచి భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారి అనుచరులు శుక్రవారం మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద నిర్మాణాలు నిలిచిపోయిన మెడికల్ కాలేజి భవనాల వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, పలు నియోజకవర్గాల నుంచి వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలి

● వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగం 75 - సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం పొలిటికల్ సైన్స్ లేదా హ్యూమానిటీస్ విద్యార్థులకే పరిమితం కాదని, ప్రతి విద్యార్థి చదవాల్సిన గ్రంథమని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని సరళంగా అర్థమయ్యేలా సాంకేతిక పదజాలం రూపొందిస్తున్న కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) కార్యక్రమాన్ని అభినందించారు. జామియా మిలియా ఇస్లామిక్ ప్రొఫెసర్ నవేద్ జమాల్ మాట్లాడుతూ రాజ్యాం గాన్ని విద్యార్థుల ముంగిటకు తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జెఎస్ రావత్, షజాద్ అహ్మద్ అన్సారీలు దేశవ్యాప్తంగా వచ్చిన రీసోర్స్ పర్సన్ల ప్రసంగాలు సమాచారపరంగా, ప్రేరణాత్మకంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అనంతరం సెమినార్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవీంద్ర సతీష్‌బాబు మాట్లాడారు. చివరగా పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు వైస్ చాన్సలర్ సర్టిఫికెట్లు అందించారు.

ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించాలి

జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు



యాప్ వినియోగంపై తర్ఫీదును పరిశీలిస్తున్న నిత్యానందరాజులు

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు నిత్యానందరాజులు అన్నారు. శుక్రవారం ఆయన వల్లూరు కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయాన్నే ప్రార్థనా సమయానికి చేరుకుని విద్యార్థులకు ప్రార్థనలు, గీతాలాపనలను ఆలపించే విధానాన్ని తెలిపారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. రాబోవు పదో తరగతి పరీక్షల్లో బాలికలు మంచి ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. ముఖ్యంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ హాస్టలులో మానిటరింగ్ యాప్‌ను ఎలా వినియోగించాలన్న అంశం పట్ల ప్రిన్సిపాల్‌కు తగిన సలహాలు ఇచ్చారు. జీసీడీవో డి.రూతు ఆరోగ్యమేరీ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఎలా మెలగాలో తర్ఫీదునిచ్చారు. అలాగే హాస్టలు మానిటరంగ్ యాప్ టెక్నికల్ టీంసభ్యుడు శివనాగేంద్రప్రసాద్ అక్కడు న్న అకౌంటెంట్‌కు యాప్‌ను ఎలా వినియోగించాలనే దానిపై తర్ఫీదు నిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



మురుగు కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో కొద్ది రోజులుగా విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఆ గ్రామంలో డీఎంహెచ్‌వో పర్యటించారు. గ్రామంలో విషజ్వరాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నివారించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న మురికికుంటల్లో గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్లు కరీష్మా, శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టీపీపీ ఉద్యోగులు

ఎర్రగుంట్ల సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ ఉద్యోగుల, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. దీక్షలో వీరభద్రారెడ్డి, నారాయణ, సాంబశివారెడ్డి, రాము, రవిశేఖర్‌రెడ్డి మరి కొందరు కూర్చొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్టు కార్మికుల బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మహేశ్‌రెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కో చైర్మన్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరులేన్ల రహదారితో... ఆరుగంటలే ప్రయాణం!

● శరవేగంగా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు

● పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ భారం



యంత్రాలతో లెవలింగ్ చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే విజయవాడ నుంచి బెంగళూరుకు కేవలం ఆరు గంటల్లోనే ప్రయాణికులు గమ్యాన్ని చేరుకోవచ్చు. ఇక కడప జిల్లా వాసులు బెంగళూరు, విజయవాడ వెళ్లేందుకు రవాణా మార్గం మరింత సులభతరమవుతుంది. బెంగళూరుకు మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. వివరాల్లోకి వెళితే...



ఆరులేన్ల రహదారి నిర్మాణానికి గ్రావెల్‌ను చదను చేస్తున్న దృశ్యం

విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ (ఆరు లేన్ల) జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాలుగో ప్యాకేజీ కింద మల్లేపల్లె - నెల్లూరు- కడప జిల్లా సరిహద్దు వరకు రూ.622 కోట్ల నిధులతో సుమారు 20 కి.మీ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 14 ప్యాకేజీలుగా విభజించి పనులు జరుగుతున్నాయి. 2024 మార్చిలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. 2026 ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికే మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ గ్రామాలైన సీతారాంపురం కనుమలగుండా రహదారి నిర్మాణం ఊపందుకుంది. ఇప్పటికే 30 శాతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహ దారికి 132 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే 70 పూర్త య్యాయి. 68 కల్వర్టులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. సగిలేరు వద్ద రెండు పెద్ద బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయి. నాలుగు చిన్న బ్రిడ్జిలు, ఎల్‌సీఈ ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. చిన్నాయపల్లె వద్ద ముడుమాల, వెంకటాపురం, బద్వేలు రోడ్డు లైను అండర్ ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద ఒక ఎల్‌ఈపీ, చిన్నాయపల్లె వద్ద రెండు ఎల్‌ఈపీలు పనులు జరుగుతున్నాయి. టన్నెల్‌కు సంబంధించి 340 మీటర్లు అండర్ ప్రోగ్రెస్‌లో ఉంది. ఇంటర్ చేంజ్ గ్రీన్‌ఫీల్డ్ కోసం 1.50 కిలోమీటరుకు పెండింగులో ఉంది. దాదాపు 70 శాతం గ్రావెల్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తయితే ప్రకాశం- కడప - పులివెందుల మీదుగా నేరుగా బెంగళూరుకు చేరుకోవచ్చు.

ఇక ఈ పనులు పూర్తయితే చెన్నారెడ్డిపేట, మల్లేపల్లె, చాపాడు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు మీదుగా ఇంటర్ ఛేంజ్‌లు ఉంటాయి. దీంతో వాణిజ్య సమాచార, రవాణా కార్యకలా పాలు పెరుగుతాయి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పచ్చదనం పెంపునకు మొక్కలు నాటడం, ప్రకృతి గండాలు తగ్గింపు, టన్నెల్స్ ద్వారా అడవిని పరిరక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

గడువుకు ముందే పనులు పూర్తి

విజయవాడ - బెంగళూరు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు అనుకున్న గడువు కంటే ముందుగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆ దిశగా నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం. 2026 ఫిబ్రవరికి ఈ పనులు పూర్తవ్వాలి. కానీ అంతకు ముందే పనులు పూర్తి చేస్తాం.

- నాయబ్‌రసూల్, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు మేనేజరు

యూరియాపై ఆందోళన వద్దు.. జేడీ



ముద్దనూరు: గోడౌన్‌లోని ఎరువుల బస్తాల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీ చంద్రానాయక్

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలకు యూరియా వాడుకోవాలని జేడీఏ చంద్రనాయక్ సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం జేడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంటల వివరాలు, యూరియా పంపిణీ, ధరల వివరాలపై దుకాణదారులు ఇబ్బంది కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఎరువుల దుకాణాల్లో నిల్వ చేసిన ఎరువులు, పురుగుల మందులు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, అమ్మిన ప్రతి ఎరువు బస్తాకు బిల్లులు అందించాలని సూచించారు. అలాగే అగ్రిల్యాబ్, వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక యూరియాతో భూసారం దెబ్బతింటుంది

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో యూరియా వాడడం వలన భూమి సారవంతం కోల్పోయి పంటల దిగుబడులు తగ్గిపోతాయని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులలు చంద్రానాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఇ.కొత్తపల్లె రైతు సేవా కేంద్రం లో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూరియాను పంటలకు ఒకేసారి వేయకుండా దశలవారీగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని ఓ ఎరువుల దుకాణాన్ని పరిశీలించి నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. అలాగే తొండూరు మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. ఎక్కువ ధరలకు యూరియాను విక్రయించకూడదన్నారు. మండల వ్యసాయాధికారి రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమ వాస్య సందర్భంగా పుష్పగిరికొండపై ఉన్న రుద్రపాదం వద్ద ఈ నెల 21 ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకట సుబ్బారెడ్డి, ఈవో శ్రీనివా సులు తెలిపారు. దక్షిణా కాశిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో కొండపైన పంచమనదీ తీర్థం వద్ద సాక్షాత్తు పరమేశ్వరుడు స్వయంగా పాదం మోపిన రుద్రపాదం వద్ద పితృదేవతల ఆత్మ సంతృప్తి, స్వర్గలోక మోక్ష ప్రాప్తికోసం పితృదేవతలకు మహాల య అమా వాస్యరోజు పిండ ప్రదానం చేస్తే చాలా మంచిదన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసంవత్సరం కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు పంచ టవల్, చెంబు, రెండు గ్లాసులు, ఉద్ధరణి లేదా పాత్ర, యజ్ఞోప వీతం (జంధ్యం) తదితర వస్తువులు తీసుకు రావాలన్నారు. పిండ ప్రదానం కింద కూర్చుని చేయలేని వారి కోసం టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం వారు పసుపు, కుంకుమ, పూలు, బియ్యం పిండి, నువ్వులు ఇతర సామగ్రి అందజేస్తాన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నిబంధనలు పాటించని ఆర్ఎంపీ క్లినిక్‌లు సీజ్

దువ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో నిబంధనలు పాటించని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లను శుక్రవారం వైద్య శాఖ సీజ్ చేసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ ప్రైవేటు క్లీనిక్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికిత్సలకు వచ్చే రోగులకు పరిమితికి మించి యాంటిబయాటిక్స్ వాడకం, సెలెన్ బాటిళ్లు ఎక్కించడంతోపాటు వాడిన వైద్యసామగ్రిని క్లినిక్‌లలో కనుగొన్నారు. సరైన అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగులకు ప్రమాదకరమని ఆయన వెల్లడించారు. స్థానికంగా ఉన్న శివప్రసాద్, శ్రీనివాసులు, షబ్బీర్, తాహీర్‌హుస్సేన్ అనే వ్యక్తులు నిర్వహిస్తున్న సదరు క్లినిక్‌లను సీజ్ చేశారు. స్థానికంగా చంద్ర క్లినిక్‌పై తనిఖీకి వెళ్లగా ఆస్పత్రి మూసివేసి ఫోన్ చేసినా అధికారులకు నిర్వాహకులు స్పందించలేదు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

కొండాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద నున్న సోలార్ కంపెనీలో జరిగిన దొంగతనం కేసులో శుక్రవారం పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. సోలార్ కంపెనీకి చెందిన రూ.24 లక్షలు విలువైన బ్యాటరీలు, వైరు దొంగతనం చేసినందుకు నలుగురిని అరెస్టు చేసినట్లు కొండాపురం సీఐ రాజా, తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ బాసు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు వారు తెలిపారు.

నంది విగ్రహం చోరీ



వినాయక విగ్రహం ఎదుట ఉన్న నంది విగ్రహం (ఫైల్), చోరీ తర్వాత ఏర్పడిన గొయ్యి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత సంగటిపల్లెలోని నరసింహస్వామి ఆలయంలో నంది విగ్రహం చోరీకి గురైంది. అతి పురాతన నరసింహస్వామి గుడి ఆవరణలో వినాయక స్వామి విగ్రహం ముందున్న నంది విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఈవో శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ చల్లనిదొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గుప్త నిధులకోసం నంది విగ్రహాన్ని దొంగలించి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఇప్పటికే పోలీసుల అదుపులో కొందరు ఉన్నట్లు సమాచారం.

ఉత్సాహంగా... రైఫిల్ షూటింగ్ పోటీలు



ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 రైఫిల్‌షూటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్‌సైట్, పీప్‌సైట్, పిస్టల్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జార్జిక్లబ్ కార్యదర్శి మార్తల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, కోఆర్డినేటర్లు ప్రవీణ్‌కిరణ్, రాఘవేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు : ఆర్డీవో

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కడప రెవెన్యూ డివి జనల్ అధికారి జాన్ ఇర్విన్ హెచ్చరించారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ, అడ్వజరీ సమావేశం డీఐఓ, పీసీఅండ్ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగ వివక్షత చట్ట రీత్యా నేరమన్నారు. కడప డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. లింగ వివక్షకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ ఆసుపత్రుల పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సెంటర్స్ పరిధిలోని గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు గర్భస్థ పూర్వ, పిండ లింగనిర్ధారణ చట్టం, ఆడబిడ్డల ప్రాముఖ్యతపై అవగాహన కల్పి ంచాలన్నారు.

రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్‌పై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): కడప రిమ్స్ దంత వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసరు చక్రపాణిపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రిమ్స్ డెంటల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేస్తున్న చక్రపాణి ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయి. ఎంసెట్ ద్వారా ర్యాంకు సాధించిన విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ కౌన్సిలింగ్ నిర్వహించి కళాశాలలను కేటాయించింది. ఈ మేరకు విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల అధ్యాపకులు తనిఖీ చేసి కళాశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు రోజులపాటు అడ్మిషన్లు కొనసాగుతాయని, మొదటిరోజు 22 మంది విద్యార్థులు కళాశాలలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి ప్రజ్ఞ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానశిబిరం విజయవంతం

- దాతల నుంచి 48 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేత చల్లపల్లి నరసింహారెడ్డి తదితరులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని పట్టణంలో స్వస్థనారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నేతలు, సీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దాతల నుంచి 48 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ రక్తదానం మహాదానం అన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది, రోగులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య నియమాలు, వ్యాధులు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ హసీనాపర్వీన్, డాక్టర్ నరసారెడ్డి, దుర్గాదేవి, వైద్యసిబ్బంది, బీజేపీ మండల కన్వీనర్ ముకుందబాబు, నాయకులు గోరంట్లరమేష్, రాజారెడ్డి, రాంకుమార్, నాగరాజు, మురళి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఐ నిరసన

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవాం సీపీఐ నేతలు నిరసన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ మాట్లాడుతూ చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోయాయ న్నారు. సానేవారిపల్లె వద్ద రోడ్డు తెగిపోవడంతో రాకపోకలపై ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీడీఓ హరినారాయణకు వినతి పత్రం అందించారు.

మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

అమ్మిచెరువు మిట్ట అంగన్వాడీలో వంట చేసిన పురుషులు ● కంబాలపల్లిలో పౌష్టికాహార వారోత్సవాలు





నిమ్మనపల్లిలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వైద్య సిబ్బంది - అమ్మిచెరువు అంగన్‌వాడీ కేంద్రం వద్ద వంటలు చేస్తున్న పురుషులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం సౌభాగ్యంగా ఉంటుందని పెద్దతిప్పసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ మహ్మద్ ఎస్థానీ, సీడీపీఓ భాగ్యమ్మ పేర్కొన్నారు. శుక్రవారం రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య మహిళ శక్తి వంతమైన కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అంగన్‌వాడీల ద్వారా మహిళలు, గర్భిణులు, బాలింతల పట్ల జాగ్రత్తగా గమనించుకోవాలన్నారు. వారికి సమతుల్య ఆహారాన్ని అందించి వారికి పౌష్టికాహారంపై రోజూ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ, సూపర్ వైజర్ హిజాద్ ప్యారీ, ఏఎన్ఎంలు రాధమ్మ, ఆశాకార్యకర్తలు కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆరోగ్యకర మహిళే కుటుంబానికి శక్తి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం శక్తివంతంగా తయారవుతుందని డాక్టర్ ప్రత్యూష, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫి పేర్కొన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లి పంచాయతీలో మహిళలు శక్తివంతంగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళలకు వివరించారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ, క్యాన్సర్ స్క్రీనింగ్, జీవనశైలిలో మార్పులపై అవగాహన సదస్సులు, వ్యాధి నిరోధక టీకాలు, ప్రధాన మంత్రి ఆరోగ్య బీమా కార్డుల నమోదు, సికెల్ సెల్ పరీక్షలు, మందుల పంపిణీ చేశామన్నారు. అనంతరం మహిళలచే స్వస్థ నారీ ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, సూపర్‌వైజర్ దేవకుమారి, శకుంతల, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పోషణ పదార్థాలు మేమే చేస్తాం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ మాకు వంటలు వండి పెట్టే ఆడోళ్లకు గర్భిణులు అయితే వారికి కొంచెం రెస్ట్ ఇచ్చి మేమే వంటలు చేసి పెడతామంటూ మగాళ్లు ముందు కొచ్చారు. శుక్రవారం మదనపల్లె ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అమ్మిచెరువుమిట్ట అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసోత్సవం నిర్వహించారు. పోషక విలువలుండే ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన రుచికరమైన వంటలను మగాళ్లు స్వయంగా వండి తమ భార్యలకు వార్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత, అంగన్‌వాడీ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కంబాలపల్లిలో పౌష్టికాహర వారోత్సవాలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అధికారులు కంబాలపల్లె అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహర వారోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారాన్ని ప్రదర్శనకు ఉంచారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు ఆకుకూరలు, దినుసులు, మొలకెత్తిన గింజలు, ప్రభుత్వ సరఫరా ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ గౌరీదేవి, చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంతోనే...

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబాల్లోని మహిళలు ఆరోగ్యంగా, శక్తివంతంగా వుంటే ఆ కుటుంబం, సమాజం దృఢంగా వుంటుందని కలికిరి ప్రభుత్వ సామాజిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ వెల్లడించారు. ప్రధాని జన్మదినం సందర్భంగా మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రకటించిన స్వస్థ నారి స శక్త్ పరివార్ అభియాన్ ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించడం కోసం సీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలకు సీహెచ్‌సీ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ఆశాలత, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఉదయకిరణ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శశికుమార్ రాజు, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్, దంత వైద్యురాలు డాక్టర్ జబీన్, ఫిజియో థెరపిస్ట్ మురళి రకరకాల వైద్య సేవలు అందజేశారు. సీహెచ్‌సీ వైద్య బృందంతోపాటు వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాతో చెరువులకు జలకళ





నిండిన రంగమ్మ చెరువు - మొరవపోతున్న దృశ్యం

కురబలకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవాతో చెరువులకు జలకళ సంతరించుకుంది. కొన్నేళ్లుగా వర్షాలు సక్రమంగా కురవపోవడంతో చెరువులు నిండలేదు. దీంతో వ్యవసాయం అంతంత మాత్రంగానే సాగింది. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో హంద్రీ-నీవాను పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే కూటమి అధికారంలోకి ఇచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు రాయలసీమకు కృష్ణాజలాలను తరలించి సస్యశ్యామలం చేయాలని సంకల్పించారు. దీంతో హంద్రీ-నీవా కాల్వకు మరమ్మతులు చేపట్టడం, ఇరువైపులా శాశ్వత సిమెంట్ పనులను చేపట్టి కుప్పంకు నీటిని తరలించారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీ-నీవా జలాలతో నింపాలని చర్యలు చేపట్టారు. కాగా చింతయ్యగారికోట సమీపంలో కాల్వ నుంచి నీటిని రంగమ్మకు 10రోజుల కిందట విడుదల చేశారు. ఈ నీటితో పాటుగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి మొరవపోతోంది. ఈ నీరు మదనపల్లె నియోజక వర్గంలోని సీటీఎం చెరువుకు చేరుతోంది. చెరువు నిండి మెరవపోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేత శెట్టి సీతారామ్ మెరవ వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కాగా చెరువులో బోటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని పలువురు చెబుతున్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

వైద్యపరీక్షలు విజయవంతం

బి.కొత్తకోట, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. 40మందికి మధుమేహం పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు, సూచనలిచ్చారు. జోన్ చైర్ పర్సన్ మోహన్‌రెడ్డి, వాకా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రతినెలా రెండో ఆదివారం సిగ్నేచర్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రిష్టారెడ్డి, వెంకటరెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హజరత్ మహబూబె సుబహాని ఉరుసు ఉత్సవాల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. దర్గా వద్ద కమిటీ అధ్యక్షుడు అగ్రహారం కాలేషా కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే నెల 6వతేదీన దీపోత్సవం, 7న గంధం, గ్యార్మీ, 8న ఉరుసు, ఖవాలీ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జహీర్, మొకానిక్ మస్తాన్, ఆటో రఫి, నాసర్, జావిద్‌బాషా, రియాజ్, బషీర్, బావాజీ, గౌస్, నాగేంద్ర, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష అలంకరణ



మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు కోర్టు ఆవరణలోని కోర్టులో గంగమ్మకు శుక్రవారం విశేషంగా పూలతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయాన్నే ఆలయంలో వేపాకులు, పూలతోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాహుకాల సమయంలో మహిళలు అధిక సంఖ్యలో అలయం చేరుకుని చీర, జాకెట్లు, పసుపు కుంకుమ, పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ విజయ దశమికి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవాలను చేస్తామన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎనుములవారిపల్లెలో ప్రభుత్వ భూమి సర్వే



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎనుములవారిపల్లెలో ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. విశ్రాంత అధ్యాపకుడు వెంకటరమణ ఆక్రమించాడని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురింతమైనది. దీనికి స్పందించిన రెవెన్యూ అధికారులు శుక్రవారం గ్రామం చేరుకుని సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని తేల్చారు. మదనపల్లె తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల సర్వేయరు, వీఆర్వోలు చేరుకుని గ్రామస్థుల సమక్షంలో సర్వే నిర్వహించారు. వెంకటరమణ ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, ప్రభుత్వ భూమికి హద్దులు చూపించారు. ఆయనకు హక్కులేదని తేల్చారు. గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను అదనంగా నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లె మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభా ప్రకారం ప్రస్తుతం పని చేస్తున్న కార్మికుల కంటే అదనంగా నియమించాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ముబారక్, తిరుమల, చలపతి నాయుడు, దేవా, జానకీ, నరసింహులు, ఫరీదా పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



కనకదాస విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కురబ సంఘాల నేతలు

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబరు 5 నిర్వహించనున్న దాసశ్రేష్ట కనకదాస విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని విగ్రహ ఏర్పాటు కమిటీ విజ్ఞప్తి చేసింది. సమాజంలోని కురబ కులస్థులందరికీ కనకదాస ఆరాధ్య దైవమని ఆయన విగ్రహాన్ని తిరుపతిలో ఏర్పాటు చేసే భాగ్యం కలగడం గొప్ప విషయమన్నారు. శుక్రవారం కలికిరిలో మండల కురబ సంఘం, మండల కనకదాస సంఘం కన్వీనరు వినాయకం లక్ష్మన్న ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు కమిటీ సమావేశం జరిగింది. అక్టోబరు 5న మధ్యాహ్నం వరకూ జరిగే పూజల అనంతరం విగ్రహం ఆవిష్కరించనున్నట్లు కమిటీ నేతలు తెలిపారు. ఉదయం నుంచి 11 గంటల వరకూ పట్టణంలో కలశాలతో మహిళల ర్యాలీ, అనంతరం కురబలు తలలపై టెంకాయలు కొట్టుకునే సంప్రదాయ కార్యక్రమం వుంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కాంస్య విగ్రహావిష్కరణ పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. కమిటీ కన్వీనరు ఎం.వెంకటప్ప, కో కన్వీనరు వి.వెంకటరమణ, సభ్యులు ఎ.రవీంద్ర, సి.మల్లిక, ఎం.రెడ్డిశేఖర, ఆర్.రమేష్, కలికిరి మండలం సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న, వివిధ కురబ సంఘ నేతలు దినకర్, వెంకట్రమణ, శంకర, మురళి, బాబు తదితరులు హాజరయ్యారు.

ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వైపు మొగ్గు చూపాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యావారిపల్లె, నగిరిమడుగు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసిన 365రోజుల కూరగాయల మోడల్, నిరంతరం ఆదాయమొచ్చే పంటలు, 32రకాల విత్తనాలతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్, మాస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య, మానస, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

తంబళ్లపల్లె/బి.కొత్తకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల చౌక దుకాణాల్లో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. రేషన్ డీలర్లు కార్డుదారుల నుంచి ఈకేవైసీ నమోదు చేసుకుని కార్డులను పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపు 37లో డీలర్ దిల్షాద్‌తో కలిసి టీడీపీ నేతలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, పురుషోత్తం, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, సోముశేఖర్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 11,900 కార్డులకు 11,823 స్మార్ట్ కార్డులు వచ్చాయని తహసీల్దారు శ్రీనివాసులు, డీటీ చాణక్య తెలిపారు. మార్పులు, చేర్పుల కోసం సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

● బి.కొత్తకోట మండల లబ్ధిదారులకు మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నేతలు అధికారులతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఇప్పటికి 17,400 రేషన్‌కార్డులు అందుబాటులోకి రాగా నగరపంచాయతీ పరిధిలోని సింహంవీధి, తాకాటంవారిపల్లి, బీరంగి తదితర ప్రాంతాల్లో పంపిణీ జరిగింది. కార్యక్రమంలో నేతలు కెవీ సుబ్బారెడ్డి, నాసర్, యండీ మస్తాన్, రియజ్‌అలీ, పురుసుబ్బన్న శివారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో నేటి నుంచి....

కలకడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు చౌకదుకాణాల వద్ద శనివారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహేశ్వరీబాయి తెలిపారు. శుక్రవారం రేషన్‌షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించి అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన 10,797 కార్డులను వారికి అందజేసినట్లు ఆమె తెలిపారు. వయస్సు 65 ఏళ్ల పై బడిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

డేవ్ ఆప్స్ వెంగార్డ్ టూల్స్ కీలకం



మాట్లాడుతున్న క్యాప్ జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సురేంద్రారెడ్డి

కురబలకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో డేవ్ ఆప్స్ వెంగార్ టూల్స్ కీలకమని క్యాప్ జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డేవ్ ఆప్స్ వెంగార్డ్ టూల్స్ అండ్ టాక్టస్ ట్రాన్స్‌ఫర్మేషన్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చన్నారు. సాంకేతిక పరంగా అనేక విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయని, అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వాటికి ఎదుర్కొనడానికి తగ్గట్టు చర్యలు చేపట్టాలన్నారు. ఈ రంగంలో మెరుగైన ఉద్యోగావకాశాలున్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీన్ చంద్రప్రకాశ్ గుప్తా, విభాగాధిపతి శ్రీదేవి, కో ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతగా వశిష్ట స్కూల్ విద్యార్థులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అండర్-17 ఖోఖో బాల, బాలిక మండల స్థాయి విజేతగా మదనపల్లె వశిష్ట స్కూల్ విద్యార్థులు నిలిచారని మండల కో- ఆర్డినేటర్ శివశంక్, లత తెలిపారు. బాలికల జట్టు విజేతలుగా మదనపల్లె వశిష్ట స్కూల్, రన్నర్లుగా గ్రీన్ వ్యాలీ స్కూల్ విద్యార్థులు నిలిచారు. బాలుర జట్టు విజేతలుగా వశిష్ట స్కూల్ విద్యార్థులు, రన్నర్లుగా సీటీఎం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారని చెప్పారు. మండల విజేతలు మదనపల్లె డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి

గుర్రంకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను పంచాయతీ అధికారులు వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. గుర్రంకొండలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది సర్వేను కట్టుదిట్టండగా చేయాలని సూచించారు. అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.

విచారణ రాయచోటికి మార్చండి

ఎస్పీకి బాధితుల వినతి

బి.కొత్తకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రుషివాటిక ఆశ్రమపాఠశాల ఘటనపై విచారణను రాయచోటికి మార్చాలని ఎస్పీకి బాధిత కుటుంబీకులు విన్నవించారు. డీఎస్పీ మహేంద్ర పాఠశాలలో విచారించగా, శుక్రవారం బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి విద్యార్థి స్వగ్రామం కాలాడివారిపల్లికి వెళ్లి విచారించారు. అయితే బాలుడిని కుటుంబీకులకు దూరంగా తీసుకెళ్లి చుట్టుముట్టి విచారించారని ఆరోపించారు. చూపు కోల్పోయిన తమ బిడ్డకు న్యాయం జరగాలంటే కేసు విచారణను రాయచోటికి మార్చాలని ఎస్పీని కోరినట్లు విద్యార్థి తండ్రి అమరనాథరెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల నిరసన



పీలేరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

పీలేరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 20వ తేదీన ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా, 22న జిల్లా కార్యాలయాలు వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కే. నాగరత్నం, ఉపాధ్యక్షుడు జీ.వీ. రమణ, కార్యదర్శి పీ. ధనలక్ష్మి, కోశాధికారి పీ. ఆంజనేయులు, వీఆర్‌ఏలు శ్రీనివాసులు, రెడ్డెప్ప, రాజేశ్వరి, జయమ్మ, మాధవి, మనోజ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పే స్కేలు అమలు చేయాలి

గుర్రంకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేలు అమలు చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు రెడ్డిశేఖర్, అరుణ, రామేశ్వరి, శ్రీనివాసులు, అశ్వని, శ్యామల, రెడ్డెమ్మ, సురేష్ పాల్గొన్నారు.

రెండో రోజు దీక్షలు

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వీఆర్‌ఏలు చేపట్టిన రెండు రోజుల మండల స్థాయి దీక్షల్లో భాగంగా శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయం ముందు చేపట్టే నిరసన దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఈ దీక్షలో మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే స్కౌట్ లక్ష్యం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాగుణాన్ని పెంపొందించడమే స్కౌట్ అండ్ గైడ్స్ లక్ష్యమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి వివరించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్, గైడ్స్ కెప్టెన్‌లు మన్సూర్, నజ్మా, జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలపై అవగాహన ఉండాలి

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పోలీసుల అత్యవసర సేవల గురించి అవగాహన పెంచుకోవాలని ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్ గురించి వివరించారు. డయల్ 100, 112, 1091, 1098, 181, 1930 టోల్ ఫ్రీ నంబర్ల గురించి విశదీకరించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు గురించి అవగాహన కల్పించారు.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ వీఎం శ్రీధర్‌కు పదోన్నతి లభించింది. ఆయనను అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పదోన్నతి కల్పించి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీటీఎం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తుండడంతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ రమేశ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సీటీఎం, కొత్తవారిపల్లె, తట్టివారిపల్లె, ఆరోగ్యవరం, దేవతానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వుండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ ఒకప్రకటనలో కోరారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నుంచి రాగిమానిపల్లెకు వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేత సిద్ధగాళ్ళ ప్రసాద్ ఎంపీడీఓ హరినారాయణను కోరారు. వర్షం కురిస్తే భారీగా మురుగు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సీసీ రోడ్డును వేసి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామ రెవెన్యూ సహాయకులు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం 23,24వ తేదీల్లో దీక్షలు, 25న విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొంటామని తెలియజేశారు. వీఆర్‌ఏలు మహేంద్ర, మస్తాన్‌వలి, బాబాజాన్, నల్లప్ప, మెహరున్నీసా, గౌసియా భాను, కవిత, రమణమ్మ, పాపులమ్మ, దొడ్డమ్మ, ప్రసన్నకుమారి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

వాల్మీకిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం నిమిత్తం వాల్మీకిపురంలో డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ చేపట్టారు. శుక్రవారం సబ్‌రిజిస్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తమ డిమాండ్లను వ్యక్తం చేశారు. ఓటీపీ విధానం, స్లాట్ బుకింగ్ రద్దు, స్కూటినిలో సబ్ రిజిస్టర్ తప్పుల సవరణలు లేకపోవడం, తదితర సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు.